# మానేరు జనత ®

తెలుగు దినపత్రిక — ఇది జనం గొంతుక

5.1.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 257 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


**బీసీసీఐ x బీసీబీ..**

క్రికెట్ బోర్డుల మధ్య వైరం




సమస్య ఏదైనా జనం కోసం జనతా..

ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989887251
- ఎడిటర్

# ఒలింపిక్ కల సాకారం చేద్దాం

## 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తాం

- వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ చాంపియన్ షిప్
- క్రీడాకారులను ఉద్దేశించి వర్చువల్గా ప్రసంగించిన ప్రధాని మోడీ
- 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్లోనే
- భవిష్యత్లో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్లపై మోడీ కీలక వ్యాఖ్యలు

3

2036 ఒలింపిక్ పూర్తిస్థాయిలో ఆతిథ్యమిచ్చే దిశగా బిడ్ చేయడానికి భారత్ చురుకుగా సన్నాహాలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వారణాసి (కాశీ)లో 72వ సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్ షిప్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆదివారం ప్రారంభించారు.



# ప్రియాంక చేతికి అసోం బాధ్యత

- ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకం
- నలుగురు సభ్యులతో కాంగ్రెస్ కమిటీ..
- మార్చి, ఏప్రిల్లో జరగనున్న అసోం ఎన్నికలు
- ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి కాంగ్రెస్ పోటీ

3





# తెలంగాణ నీటి హక్కులపై సుప్రీంలో పోరు

- ఏపీ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నేడు సుప్రీంకోర్టులో విచారణ
- ముంబైలో సీనియర్ న్యాయవాది సింఘ్వీతో సీఎం రేవంత్ భేటీ
- పోలవరం, నల్లమల సాగర్‌పై బలమైన వాదనలకు వ్యూహరచన
- మంత్రి ఉత్తమ్ కుమార్‌తో కలిసి న్యాయపరమైన అంశాలపై చర్చ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం న్యాయపోరాటాన్ని తీవ్రతరం చేసింది. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఈ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వేదికగా బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధమైంది.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు



## నదీ జలాల్లో ద్రోహం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే..

- కేసీఆర్ వల్లే నష్టమంటూ తప్పుడు మాటలు
- బాబుకు చెప్తే రాయలసీమ ఆపారని అబద్ధాలు
- ఏపీ వాళ్లే తప్పంటున్నారు.. సిగ్గుంటే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి
- సీఎంకు కాళేశ్వరంపై కక్ష.. పాలమూరుపై పగ
- 28 డీపీఆర్‌లు పంపాం.. 7 అనుమతులు తెచ్చాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క డీపీఆర్‌నూ పంపలేదు
- శ్రీశైలం, తుంగభద్రలో నీటి వాటాను దక్కించుకునేందుకే పాలమూరు-రంగారెడ్డి ఇన్‌టేక్‌ను జూరాల నుంచి మార్చాం
- నన్ను అరెస్టు చేస్తారో, హత్య చేయిస్తారో!
- అయినా కాంగ్రెస్ అన్యాయాన్ని ఎండగడతాం
- కేసీఆర్ ఆధ్వర్యంలో మరో జలపోరాటం: హరీశ్

**జనతా న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణ సాగునీటి రంగంలో కాంగ్రెస్ పార్టీ చరిత్ర అంతా ద్రోహాలమయ-ంమేనని, నాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులను అటకెక్కించిన ఆ పార్టీ, నేడు అధికారంలోకి వచ్చాక కూడా అదే పంథాను కొనసాగిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్ వేదికగా ఃనదీ జలాలు – కాంగ్రెస్ ద్రోహాలుః అనే

మిగతా 2 లో

## రాహుల్ గాంధీని, రేవంత్‌ను ఉరి తీయాలి



- ముఖ్యమంత్రిపై కేటీఆర్ ఫైర్
- వినాశకాలే విపరీత బుద్ధి.. సీఎం తీరుపై తీవ్ర ధ్వజం
- బేసిక్స్, బేసిన్లు తెలియని అజ్ఞాని రేవంత్
- అశోక్ నగర్, వరంగల్ హామీలు తప్పినందుకు మిమ్మల్ని ఎన్నిసార్లు ఉరితీయాలి?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్

03



## తమిళనాడులో 2026లో ఎన్డీఏదే అధికారం

- స్టాలిన్ గురి కొడుకు పట్టాభిషేకంపైనే.. ప్రజా సమస్యలపై కాదు
- దేశంలోనే అత్యంత అవినీతి సర్కార్ డీఎంకేదే
- ఉదయనిధి సీఎం కావాలనే కల నెరవేరదు
- కేంద్ర మంత్రి అమిత్ షా ధ్వజం

.. వివరాలు 3లో

## బీఆర్ఎస్‌లో తోకే కుక్కను ఊపుతోంది!

- అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం హరీశ్‌దా?,బీఆర్ఎస్‌దా?
- బయట సభలు పెడితే ఎవరు నమ్ముతారు?: కవిత

సాధారణంగా కుక్క తన తోకను ఊపుతుందని.. కానీ బీఆర్ఎస్‌లో తోకనే కుక్కను ఊపే పరిస్థితి వచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సభ్యులు హరీశ్‌ను తిడితే.. బీఆర్ఎస్ వారందరినీ సభకు రాకుండా హరీశ్‌రావు సొంత నిర్ణయంతో సమావేశాలను బహిష్కరించారని ఆరోపించారు.



03

## ట్యాపింగ్‌లో కేటీఆర్ పాత్ర ఏంటి?

- శ్రవణ్‌రావు, రవిపాల్‌తో ఏం సంబంధం
- ఎమ్మెల్సీ నవీన్‌రావుకు సిట్ ప్రశ్నలు
- ట్యాపింగ్ బాధితులపై కొత్త సిట్ దృష్టి
- వారిని మళ్లీ విచారించేందుకు సన్నద్ధం

02



## చేతులకు బేడీలతో జైలుకు మదురో

- కరుడుగట్టిన ఖైదీలా మదురోను తరలించిన అధికారులు
- డ్రగ్స్ ఉగ్రవాద ఆరోపణలు రుజువైతే జీవితకాలం జైల్లోనే..
- అమెరికా అధికారులకు మదురో న్యూఇయర్ శుభాకాంక్షలు
- మీకూ అదే గతి.. క్యూబా, చిలీ, కొలంబియాలకు ట్రంప్ హెచ్చరిక
- రష్యా కూడా జెలెన్స్కీని ఇలాగే బంధిస్తే ఏం చేస్తారు?
- ట్రంప్ తీరును ప్రశ్నించిన ఆ దేశ ప్రజాప్రతినిధి రో ఖన్నా
- అమెరికా దాడిలో 40 మంది మరణించారు: వెనెజువెలా

4

## మేడారం పనులకు ఈ నెల 20లోపు సీఎం శ్రీకారం

### వందల ఏళ్లు నిలిచేలా రాతి కట్టడాల నిర్మాణం

- అంకితభావంతో పనులు పూర్తి చేస్తున్నాం
- ఈనెల 28 నుంచి 31 వరకు వైభవంగా మహాజాతర
- మంత్రి సీతక్క పర్యవేక్షణ అభినందనీయం
- అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

03



## తెలంగాణ నీటి హక్కులపై

# సుప్రీంలో పోరు

**ఏపీ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నేడు సుప్రీంకోర్టులో విచారణ**

**ముంబైలో సీనియర్ న్యాయవాది సింఘ్వీతో సీఎం రేవంత్ భేటీ**

**పోలవరం, నల్లమల సాగర్‌పై బలమైన వాదనలకు వ్యూహరచన**

**మంత్రి ఉత్తమ్ కుమార్‌తో కలిసి న్యాయపరమైన అంశాలపై చర్చ**

**ముంబై/హైదరాబాద్, జనవరి 4:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం న్యాయపోరాటాన్ని తీవ్రతరం చేసింది. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఈ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వేదికగా బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధమైంది. ఈ కేసులకు సంబంధించి సోమవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరగనున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ముంబైకి వెళ్లారు. అక్కడ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సోమవారం నాటి విచారణలో తెలంగాణ తరఫున వినిపించాల్సిన వాదనలు, లేవనెత్తాల్సిన అభ్యంతరాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు జరిగే అన్యాయాన్ని కోర్టు దృష్టికి సమర్థవంతంగా తీసుకువెళ్లేలా వ్యూహరచన చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెంపు, బ్యాక్ వాటర్ సమస్యలతో పాటు, కొత్తగా ప్రతిపాదించిన నల్లమల సాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, రాష్ట్ర నీటి హక్కులను కాపాడుకునేందుకు న్యాయపరంగా గట్టిగా పోరాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే స్వయంగా ముఖ్యమంత్రే రంగంలోకి దిగి న్యాయ నిపుణులతో చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## నల్లమలసాగర్‌ను నిలువరించండి

**సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్.. నేడు విచారించనున్న సీజేఐ ధర్మాసనం**

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం – నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 'మిగులు/వరద జలాల పేరుతో గోదావరిపై ఏపీ అక్రమంగా నల్లమలసాగర్ ప్రాజెక్టును నిర్మించాలని చూస్తోంది. ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారీ, సెగ్మెంట్ 1 కింద ఉండే ప్రస్తుత కనెక్టివిటీ పనుల విస్తరణ, కుడి ప్రధాన కాలువ నిర్మాణ కార్యకలాపాలు చేపట్టకుండా స్టే ఇవ్వండి. కేంద్ర జలశక్తి, ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖల ద్వారా ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు/డీపీఆర్ మూల్యాంకనం చేయకుండా, చట్టబద్ధ అనుమతులు మంజూరు చేయకుండా, ఆర్థిక సహాయం అందించకుండా ఆదేశాలు ఇవ్వండి' అని పిటిషన్‌లో విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం 251 పేజీలతో తెలంగాణ తరఫున న్యాయవాది సుమంత్ నూకల రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో కేంద్ర జల వనరుల శాఖ, ఆర్థిక, పర్యావరణ శాఖలతోపాటు జీఆర్ఎంబీ, ఆంధ్రప్రదేశ్, కేఆర్ఎంబీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సీడబ్ల్యూసీలను ప్రతివాదులుగా చే ర్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం – 2014, అంతర్‌రాష్ట్ర నదీ జలాల చట్టం, సీడబ్ల్యూసీ, పీపీఏ, కృష్ణా, గోదావరి జలాల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్‌ల అవార్డులు, భౌగోళికంగా ఉల్లంఘన అంశాలను ఇందులో ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీరుపై ఇప్పటికే.. కేంద్ర జలశక్తిశాఖ, కేంద్ర జలసంఘం, పీపీఏ, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ), కృష్ణా, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులకు సైతం ఫిర్యాదు చేశామని పిటిషన్‌లో పేర్కొంది. గతంలో ముల్లపెరియార్ డ్యామ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ పిటిషన్‌లో గుర్తు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వరద జలాల పేరుతో పీబీ లింకు, పీఎన్ లింకు ప్రాజెక్టులను ఏపీ చేపడుతోందని ఆరోపించింది. దీనికి సంబంధించిన ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిట్టను ఇప్పటికే కేంద్రానికి సమర్పించినట్టు తెలిపింది. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు పీఎఫ్ఆర్‌కు సూత్రప్రాయంగా అంగీకారం లభించిన తర్వాతే డీపీఆర్ తయారు చేయాల్సి ఉంటుందని, ఏపీ ఇవేమీ పట్టించుకోవడం లేదని ఆరోపించింది. ఏపీ ప్రభుత్వం సమర్పించిన పీఎఫ్ఆర్‌పై తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు సైతం అభ్యంతరాలను వ్యక్తం చేశాయని గుర్తు చేసింది. ఆంధ్రప్రదేశ్ తీరును కేంద్రం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించకపోవటంతో కోర్టును ఆశ్రయిస్తున్నట్టు తెలిపింది. తక్షణమే ఆంధ్రప్రదేశ్‌ను నిలువరించాలని, ఈ విషయంలో ఎటువంటి సహాయం అందించవద్దని కేంద్రాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు సోమవారం విచారణకు రానుంది. ఈ కేసులో బలమైన వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఏపీ ప్రభుత్వం నియమించుకుంది. ఆదివారం ఢిల్లీలో ఆయనతో రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు సమావేశమై ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేశారు.


## నేడు అసెంబ్లీలో హిల్ట్‌పై చర్చ

**హైదరాబాద్ :** హైదరాబాద్ పారిశ్రామిక భూముల బదలాయింపు (హిల్ట్) విధానంపై సోమవారం శాసనసభలో కీలక చర్చ జరగనుంది. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, భూవినియోగ విధానాలపై ప్రభావం చూపుతున్న హిల్ట్ విధానంలో ప్రతిపాదిత సవరణలు చర్చలో ప్రధాన అంశంగా ఉండనున్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక పార్కుల్లోని భూముల వినియోగం, కన్వర్షన్ ఫీజు, కంపెనీల సమస్యలపై ఇటీవల పారిశ్రామికవేత్తలు సందేహాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హిల్ట్ పాలసీపై ప్రభుత్వం జీవో నెం 27ను గత ఏడాది నవంబరు 22న విడుదల చేయగా.. 45 రోజులు కావస్తున్నా భూ వినియోగ మార్పు కోసం దరఖాస్తులేమీ రాలేదని విశ్వసనీయ సమాచారం. ఓఆర్ఆర్ వెలుపలికి వెళ్తే నూతన పరిశ్రమలు నెలకొల్పేందుకు అనువైన వాతావరణం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని, ఆ కారణంగానే తాము సందిగ్ధంలో ఉన్నామని పలువురు పారిశ్రామికవేత్తలు ఇటీవల నిర్వహించిన సదస్సుల్లో పేర్కొన్నారు. దాంతో సోమవారం శాసనసభలో చర్చకు రాబోయే హిల్ట్ పాలసీలో ఏమైనా మార్పు చేర్పులు ఉంటాయా లేదా అని పారిశ్రామిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. పారిశ్రామికవేత్తలు కోరుతున్నట్లు కొత్త మార్గదర్శకాలు చేర్చబోతున్నారా అనేది ఆసక్తిగా మారింది. అసెంబ్లీలో చర్చ అనంతరం ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఈ విధానాన్ని ప్రతిపక్షాలు లక్షల కోట్ల స్కాంగా ఆరోపించగా, ప్రభుత్వం కూడా దీటుగానే సమాధానమిచ్చింది. ఈ ప్రక్రియ బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందంటూ ఆరోపణలను తిప్పికొట్టింది. 'వారు చేస్తే పాలన.. మేము చేస్తే స్కాం ఎలా అవుతుంద'ని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. తాము కేవలం యాజమాన్య హక్కులు ఉన్న వారికి మాత్రమే ఈ వెసులుబాటు కల్పిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. హిల్ట్ విధానం మూతపడిన పరిశ్రమల యజమాన్యాలకు మాత్రమే ఉపయోగకరమని పలువురు పారిశ్రామికవేత్తలు 'ఆంధ్రజ్యోతి' వద్ద అభిప్రాయం వ్యక్తం చేశారు. పరిశ్రమలను ఉన్న పళంగా మరో చోటుకు తరలించడం ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. ప్రభుత్వం మొదట ఓఆర్ఆర్ అవతల పారిశ్రామికవాడలను ఏర్పాటుచేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే ఈ ప్రక్రియ సజావుగా జరుగుతుందని పేర్కొన్నారు. దానికి తోడు భూవినియోగ మార్పు తప్పనిసరి కాదని చెప్పడంవల్ల కూడా పారిశ్రామికవేత్తల్లో మరింత గందరగోళం నెలకొందన్నారు. ప్రస్తుత పారిశ్రామికవాడల్లో కొందరు వినియోగ మార్పు చేసుకుని, మరికొందరు చేసుకోకపోతే.. చుట్టుపక్కల నివాస ప్రాంతాలు ఏర్పడితే అక్కడ కొనసాగాలనుకునే పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

మొదటి పేజీ తరువాయి

అంశంపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సాగునీటి రంగంపై పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపిస్తూ, గణాంకాలు, అధికారిక పత్రాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవాలను వివరించారు.




### కృష్ణా జలాల్లో హక్కుల తాకట్టు

కృష్ణా నదీ జలాల పంపిణీలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో 68 శాతం కృష్ణా నదీ పరివాహక ప్రాంతం తెలంగాణలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పాలకులు కేవలం 299 టీఎంసీలు (34 శాతం) మాత్రమే కేటాయించి, ఆంధ్రాకు 512 టీఎంసీలు (66 శాతం) కట్టబెట్టారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం ఈ అన్యాయాన్ని సరిదిద్దేందుకు తీవ్రంగా కృషి చేసిందని, కృష్ణా జలాల్లో సగం వాటా (50:50) కోసం కేంద్రానికి 28 లేఖలు రాసి పోరాడిందని తెలిపారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం, 1956లోని సెక్షన్–3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం సుప్రీంకోర్టు గడప తొక్కి కేంద్రం మెడలు వంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పోరాటాన్ని గాలికి వదిలేసి, 2024–25 సంవత్సరానికి గాను పాత పద్ధతిలోనే 66:34 నిష్పత్తికి అంగీకరించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

### పాలమూరు-రంగారెడ్డికి ఉరి

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును హరీశ్ రావు ఎండగట్టారు. కరువు ప్రాంతాల దాహం తీర్చడానికి కేసీఆర్ ప్రభుత్వం శ్రీశైలం నుండి 90 టీఎంసీల నికర జలాలను 60 రోజుల్లో (రోజుకు 2 టీఎంసీల చొప్పున) ఎత్తిపోసేలా ప్రాజెక్టును రీ–డిజైన్ చేసిందని తెలిపారు. కానీ, ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాస్తూ, తమకు 45 టీఎంసీలు చాలంటూ ప్రాజెక్టు లక్ష్యాన్ని సగానికి తగ్గించారని, ఇది తెలంగాణ రైతాంగానికి చేసిన నయవంచన అని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం అటవీ, వన్యప్రాణి, పర్యావరణ అనుమతులు సహా మొత్తం 7 కీలక అనుమతులు సాధిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం డీపీఆర్ ను కూడా సక్రమంగా సమర్పించలేక వెనక్కి తెప్పించుకుందని ఎద్దేవా చేశారు. అసలు డీపీఆర్ వాపస్ రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వమే కారణమని కేంద్రం రాసిన లేఖను ఈ సందర్భంగా ఆయన ప్రదర్శించారు.

### ఎస్ఎల్బీసీ సొరంగంపై గోబెల్స్ ప్రచారం

ఎస్ఎల్బీసీ సొరంగం పనుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్న కాంగ్రెస్ ఆరోపణలను హరీశ్ రావు తిప్పికొట్టారు. ఆర్టీఐ ద్వారా సేకరించిన అధికారిక సమాచారాన్ని బయటపెడుతూ.. 2014 నుంచి 2023 మధ్య కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 11.48 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పూర్తి చేసి రూ.1358 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. మరోవైపు, గడిచిన రెండేళ్లలో (2023–25) కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వింది కేవలం 18 మీటర్లు మాత్రమేనని, ఇందుకు రూ.195 కోట్లు ఖర్చు చేసిందని ఎద్దేవా చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే బీఆర్ఎస్ హయాంలో ఒక్క మీటరు కూడా తవ్వలేదని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు.

### పోతిరెడ్డిపాడు పాపం కాంగ్రెస్ దే

రాయలసీమకు నీటిని తరలించే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచింది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీనే అని హరీశ్ రావు కుండబద్దలు కొట్టారు. 2005లో జీవో నెం.170 ద్వారా పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 40,000 క్యూసెక్కులకు పెంచారని, తద్వారా మొత్తం నీటి విడుదల సామర్థ్యాన్ని 1,83,216 క్యూసెక్కులకు చేర్చింది నాటి కాంగ్రెస్ పాలకులేనని ఆధారాలు చూపించారు. నాడు గులాబీ ఎమ్మెల్యేలు, మంత్రులు దీనిని వ్యతిరేకిస్తూ పదవులకు రాజీనామాలు చేశారని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అక్రమంగా చేపట్టినప్పుడు, కేసీఆర్ ప్రభుత్వం ఎన్జీటీ లో కేసు వేసి స్టే తెచ్చి అడ్డుకుందని, కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ అక్రమాలకు వంత పాడుతోందని విమర్శించారు.

### విధ్వంసకర పాలన

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సాగునీటి రంగం స్వర్ణయుగంగా వెలుగొందితే, నేటి కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులు కుప్పకూలుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే పెద్దవాగుకు గండి పడి 14 గ్రామాలు నీట మునిగాయని, వట్టెం పంప్ హౌస్, సుంకిశాల పంప్ హౌస్ లు నీట మునిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. కేవలం కమిషన్ల కక్కుర్తితోనే కోడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కొత్త ప్రతిపాదనలు తెస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని, లేదంటే కాంగ్రెస్ ద్రోహాలను ఎండగడుతూ మరో జల ఉద్యమాన్ని నిర్మిస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

# ట్యాపింగ్‌లో కేటీఆర్ పాత్ర ఏంటి?

**శ్రవణ్‌రావు, రవిపాల్‌తో ఏం సంబంధం**

**ఎమ్మెల్సీ నవీన్‌రావుకు సిట్ ప్రశ్నలు**

**ట్యాపింగ్ బాధితులపై కొత్త సిట్ దృష్టి**

**వారిని మళ్లీ విచారించేందుకు సన్నద్ధం**

**హైదరాబాద్, జనవరి 4 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రావును ఆదివారం సిట్ అధికారులు రెండోసారి ప్రశ్నించారు. దాదాపు 9 గంటల పాటు పలు అంశాలకు సంబంధించి విచారణ చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్ పాత్రకు సంబంధించిన కొన్ని ప్రశ్నలను అడిగినట్లు తెలుస్తోంది. రాజకీయ సంబంధాలపై తనను ప్రశ్నలు అడిగారన్న విషయాన్ని నవీన్‌రావు విచారణ తర్వాత మీడియా ముందు చెప్పారు. తనను 2024 సెప్టెంబరులో విచారణకు పిలిస్తే వెళ్లానని, అప్పట్లో మూడు గంటలు విచారించారని, ఇప్పుడు కూడా అవే ప్రశ్నలు అడిగారని పేర్కొన్నారు. ట్యాపింగ్ పరికరాల కొనుగోలు గురించి తనను ప్రశ్నించలేదని చెప్పారు. రాజకీయ నేతలు, కొందరు వ్యక్తులతో సంబంధాల గురించి అడిగారని.. అన్నింటికీ సమాధానం చెప్పానని, మళ్లీ విచారణకు రావాలని పిలవలేదని పేర్కొన్నారు. కాగా, ప్రభాకర్ రావు బృందం చేసిన ఫోన్ ట్యాపింగ్ ఒక ఎత్తయితే శ్రవణ్‌రావు, ప్రణీత్‌రావు, నవీన్‌రావులు కలిసి ఒక మాజీ మంత్రి కోసం చేసిన ఫోన్ ట్యాపింగ్ మరో ఎత్తని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ట్యాపింగ్ కేసులో నిందితుడు, మీడియా ఛానల్ అధినేత శ్రవణ్‌రావును ఎస్ఐబీ బృందానికి పరిచయం చేసింది నవీన్‌రావు అని అనుమానిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ కోణాన్ని ఆవిష్కరించడంలో నవీన్‌రావు పాత్ర కీలకమని భావిస్తున్నారని తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ రెండు దశల్లో జరిగిందని, అందులో ఎస్ఐబీ కార్యాలయం నుంచి కొంత కాగా.. మరికొంత శ్రవణ్‌రావు ఇల్లు, ఆఫీసు నుంచి జరిగినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. అప్పట్లో సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావుపై కేసులు నమోదు చేయించడం వెనుక నవీన్‌రావు పాత్ర ఉందని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. శ్రీధర్‌రావుకు సంబంధించిన ఫోన్ సంభాషణలను ట్యాప్ చేసి, ఆయన్ను బెదిరింపులకు గురిచేశారని, అందులో నాటి మంత్రికి సంబంధాలున్నాయనే ఆరోపణలపై ఇప్పటికే సిట్ అధికారులు విచారణ జరిపారు. శ్రవణ్‌రావు ఇంట్లో ఏర్పాటు చేసిన ట్యాపింగ్ యూనిట్‌కు సంబంధించిన




సాంకేతిక పరికరాలను గతంలో ఎస్ఐబీకి టెక్నికల్ కన్సల్టెంట్‌గా ఉన్న రవిపాల్ ద్వారా తెప్పించారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో రవిపాల్, నవీన్‌రావు, శ్రవణ్‌రావుల సంబంధాలపై సిట్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతి రెడ్డిల ఫోన్ల సంభాషణల ట్యాపింగ్, ఆ ఆడియోలను కీలక వ్యక్తులకు చేరవేయడంలో నవీన్‌రావు పాత్ర ఉన్నట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది.

### మరికొందరికి నోటీసులకు సన్నద్ధం..

2023 నవంబరులో 618 ఫోన్ నంబర్లకు సంబంధించిన సమాచారం కావాలంటూ సర్వీస్ ప్రొవైడర్లకు ఎస్ఐబీ నుంచి లేఖ వెళ్లింది. అందులో ఉన్న పేర్ల ఆధారంగా పాత సిట్ దర్యాప్తు జరపగా, కొత్తగా వచ్చిన సిట్ బృందం ఎమ్మెల్యేల కొనుగోలు కేసు, శ్రీధర్‌రావు వ్యవహారంతో పాటు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపణలు చేసిన వారందరినీ మరోసారి విచారించి బాధ్యులకు నోటీసులు ఇవ్వడానికి సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బీఆర్ఎస్‌లోని కొందరు పెద్దలను విచారణకు పిలవాలని సిట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం జరిగిన విచారణలో సిట్ అధికారులు విజయ్‌కుమార్, రవీందర్ రెడ్డి, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

## ట్యాపింగ్ కేసులో హరీశ్ విచారణకు అనుమతివ్వండి

**సుప్రీంకోర్టులో తెలంగాణ పిటిషన్**

**న్యూఢిల్లీ, జనవరి 4 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత హరీశ్‌ను విచారించేందుకు అనుమతివ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ నాగరత్న నేతృత్వంలోని జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన దిసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది. హరీశ్‌రావు ఆదేశాల మేరకు పోలీస్ అధికారి రాధాకిషన్‌రావు తన ఫోన్ ట్యాప్ చేశారని ఆరోపిస్తూ 2024లో సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ పంజాగుట్ట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 2024 డిసెంబరు 1న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ తర్వాత హరీశ్ పీఏ వంశీకృష్ణ సహా మరో ముగ్గురుని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు తనపై అక్రమంగా కేసు పెట్టారని, ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ హరీశ్ 2924 డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. సుధీర్ఘ వాదనల అనంతరం హరీశ్‌పై కేసు పెట్టడానికి సరైన ఆధారాలు, బలమైన సాక్ష్యలేమీ లేవంటూ హైకోర్టు 2025 మార్చి 4 ఆ కేసును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును ఛక్రధర్ గౌడ్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఇరుపక్షల వాదనల అనంతరం జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి కారణాలేమీ కనిపించడం లేదని అభిప్రాయపడింది. చక్రధర్ గౌడ్ పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును పోలీసులు విచారించడం, రాష్ట్రంలో కేసు రోజుకో మలుపు తిరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం హరీశ్‌ను ప్రతివాదిగా చేరుస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అందులో చక్రధర్‌ను సైతం ప్రతివాదిగా చేర్చింది. దీనిపైనే సుప్రీం విచారణ జరపనుంది.

# మేడారం పనులకు ఈ నెల 20లోపు సీఎం శ్రీకారం

**వందల ఏళ్లు నిలిచేలా రాతి కట్టడాల నిర్మాణం**

**తక్కువ సమయం ఉన్నా అంకితభావంతో పనులు పూర్తి చేస్తున్నాం**

**ఈనెల 28 నుంచి 31 వరకు వైభవంగా మహాజాతర**

**మంత్రి సీతక్క పర్యవేక్షణ అభినందనీయం**

**అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**




**ములుగు/మేడారం, జనవరి 4:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం మహాజాతరకు సంబంధించి ఈనెల 20వ తేదీ లోపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మేడారం జాతర పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం జరగనుంది“ అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఖమ్మం పర్యటన అనంతరం ఆదివారం ఆయన మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, జిల్లా అధికారులతో కలిసి మేడారంలో పర్యటించారు. జాతర ఏర్పాట్లు, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం అమ్మవార్ల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. “కోట్లాది భక్తుల కొంగుబంగారం శ్రీ సమ్మక్క-సారలమ్మల మహాజాతర అభివృద్ధి పనులు అమ్మవార్ల దయతో శరవేగంగా జరుగుతున్నాయి. మొదలుపెట్టిన తడువుగా నిర్విరామంగా పనులు సాగుతున్నాయి. రాతి కట్టడాలతో వందల ఏళ్లు చెక్కు చెదరకుండా నిలిచే నిర్మాణాలను చేపడుతున్నాం. సమయం తక్కువగా ఉన్నప్పటికీ అంకుటిత దీక్షతో వీటిని పూర్తి చేయబోతున్నాం“ అని తెలిపారు.

### 28 నుంచి జాతర వైభవం

ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ జాతర నిర్వహణకు సర్వం సిద్ధమవుతోంది. నా సోదరి, స్థానిక మంత్రి సీతక్క ప్రతిరోజు ఇక్కడే అందుబాటులో ఉండి పనులను వేగవంతం చేస్తున్నారు. ఆమె కృషి అభినందనీయం. గిరిజన ఆచారం, సాంప్రదాయాల ప్రకారం జాతర ప్రాంగణం ఆధునీకరణ, ప్రధాన ఆర్చి, జంపన్నవాగు వద్ద స్నాన ఘట్టాలు, విశాలమైన రోడ్లు, సెంట్రల్ లైటింగ్, పచ్చదనం, ఆదివాసీ శిల్పాలతో కూడళ్ల సుందరీకరణ వంటి పనులు చివరి దశకు వచ్చాయి“ అని మంత్రి వివరించారు.

### చరిత్రలో నిలిచిపోయేలా..

దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజా ప్రభుత్వం ఈ జాతరను నిర్వహించడానికి సిద్ధంగా ఉంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యులవుతున్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీని, రేవంత్‌ను ఉరి తీయాలి

**ముఖ్యమంత్రిపై కేటీఆర్ ఫైర్**

**వినాశకాలే విపరీత బుద్ధి.. సీఎం తీరుపై తీవ్ర ధ్వజం**

**బేసిక్స్, బేసిన్లు తెలియని అజ్ఞాని రేవంత్**

**అశోక్ నగర్, వరంగల్ హామీలు తప్పినందుకు మిమ్మల్ని ఎన్నిసార్లు ఉరితీయాలి?**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్**



**హైదరాబాద్, జనవరి 4:** నదీ జలాల విషయంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాలను ఎండగడుతూ మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ఇచ్చిన సందర్భంగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో సభానాయకుడి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి తీరు ఃవినాశకాలే విపరీత బుద్ధిః అన్నట్లుగా ఉందని మండి పడ్డారు. అధికార మదంతో, బలుపు మాటలతో సీఎం విర్రవీగుతున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. “చావు నోట్లో తలపెట్టి, తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించిన త్యాగధనుడు కేసీఆర్. కరువు నేలల్లో సిరులు పండించిన మానవీయ పరిపాలకుడు ఆయన. అలాంటి గొప్ప నాయకుడిని, హరీష్ రావును ఉరితీయాలని రేవంత్ మాట్లాడుతుంటే హృదయం రగిలిపోతోంది. అసలు ఉరి తీయాల్సి వస్తే.. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నేతలను, మిమ్మల్ని ఎన్నిసార్లు ఉరితీయాలి?“ అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకత్వం మాట తప్పిన తీరుపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. 'అశోక్ నగర్ అడ్డా సాక్షగా 2 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి నిరుద్యోగులను



మోసం చేసినందుకు రాహుల్ గాంధీని ఉరితీయాలి. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పినందుకు వరంగల్ సాక్షగా రాహుల్ గాంధీని ఉరితీయాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అని చెప్పి మోసం చేసినందుకు కామారెడ్డిలో రేవంత్ రెడ్డిని, రాహుల్ గాంధీని ఉరితీయాలి. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, సర్వభ్రష్ట ప్రభుత్వానికి రేవంత్ అధినేతగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రికి పరిజ్ఞానం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. “రేవంత్‌కు ఐఐటీ కి, ఐఐఐటీ కి తేడా తెలియదు. బచావత్ ట్రిబ్యునల్‌కు, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అంతరం తెలియదు. అసలు దేవాదుల ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందో కూడా తెలియని వ్యక్తి ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి ఒక అజ్ఞాని.. ఒక ఉష్ట్రపక్షి“ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ సమైక్యవాదుల సంచులు మోసినప్పుడు, తాము తెలంగాణ కోసం కొట్లాడామని గుర్తు చేశారు. జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయం 65 ఏళ్ల కాంగ్రెస్ పాలన, 17 ఏళ్ల చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ పాలన వల్లే జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డికి కూడా ఇందులో భాగం ఉందని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఆయనకు ఏమీ తెలియదని విమర్శించారు. రేవంత్ రెడ్డికి ఒకే భాష వచ్చునని, తాము తలచుకుంటే అంతకంటే దీటుగా మూడు నాలుగు భాషల్లో తిట్టగలమని హెచ్చరించారు.

# మావోయిస్టుల కొత్త వ్యూహం

## డెడ్‌లైన్ తర్వాత ఒక్క దళమైనా మిగలాలి!

**తమను నిర్మూలించలేరని మార్చి 31 తర్వాత సవాల్ విసిరే ఎత్తుగడ**

**తిప్పిరి తిరుపతి నేతృత్వంలో దళాలు కదులుతున్నట్లు గుర్తింపు**

**కేంద్ర కమిటీలోని తెలంగాణవారు నలుగురు లొంగుబాటుకు నో**

**డెడ్‌లైన్ ముగిసేవరకు ప్రాణాలు కాపాడుకోవడంపైనే దృష్టి**

**హైదరాబాద్, జనవరి 4 :** దేశంలో నక్సలైట్లను అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు అయిన మార్చి 31వ తేదీ తర్వాత కూడా మనుగడ సాగించి, తమను నిర్మూలించటం సాధ్యం కాదని పాలకులకు సవాల్ విసరాలని మావోయిస్టులు భావిస్తున్నట్లు తెలిసింది. అందుకోసం పార్టీ అగ్రనేతలు కొత్త వ్యూహాలు సిద్ధం చేసినట్లు ఇటీవల లొంగిపోయిన కొందరు కీలక నేతల ద్వారా పోలీసులు తెలుసుకున్నట్లు సమాచారం. పార్టీని నడిపిస్తున్న అగ్రనాయకత్వం దళాలను కాపాడుకోవడానికి కొత్త ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఊహించని ప్రదేశాలకు వెళ్లి తలదాచుకోవాలని దళాలకు పార్టీ సూచించినట్లు సమాచారం. మార్చి 31లోపు ఆపరేషన్ కగార్‌ను పూర్తిచేసేందుకు భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరైనా మైదాన ప్రాంతాలకు చేరి, నమ్మకస్తుల సహకారంతో ప్రాణాలు కాపాడుకుని డెడ్‌లైన్ దాటిన తర్వాత బయటకు వచ్చి, మావోయిస్టు పార్టీని నిర్మూలించడం ప్రభుత్వ తరం కాదని సవాల్ విసరాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం వ్యూహం పన్నిందని నిఘావర్గాలకు సమాచారం అందింది. కాగా, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీఅబశ్రీశ్రీసగఢ్, ఒడిశా, జారండ్‌రాష్ట్రాల్లో కొద్దిగా మిగిలిన మావోయిస్టులు సురక్షత ప్రాంతాలను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మావోయిస్టు పార్టీలో తెలంగాణలో మిగిలిన 17 మందిలో 8 మంది కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొత్త సారథిగా ప్రచారమవుతున్న తిప్పిరి తిరుపతితో పాటు బడే చొక్కారావు, ముప్పిడి సాంబయ్య, లోకేటి చందర్‌రావుల ఆధ్వర్యంలో దళాలు కదులుతున్నట్లు నిఘా వర్గా లు అనుమానిస్తున్నాయి. కేంద్ర కమిటీలోని మిగిలిన నలుగురు తెలంగాణ వాసులు లొంగుబాటుకు సిద్ధంగా లేరన్న సమాచారం పోలీసులకు అందినట్లు తెలుస్తోంది. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినటంతో కొద్దిమందితోనే పార్టీ ముఖ్యులు కదులుతున్నారని, తిప్పిరి తిరుపతివద్ద సైతం 20 మందికి మించి దళ సభ్యులు లేరని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. రాయ్‌పూర్‌లో గత నెలలో జరిగిన డీజీపీల సమావేశంలో మావోయిస్టు పార్టీపై చర్చ జరిగినట్లు సమాచారం. ఏ రాష్ట్రం వారు వచ్చినా ఆహ్వానిస్తామని తెలంగాణ పోలీసులు ప్రకటించటంతో లొంగుబాటుకు సిద్ధంగా ఉన్నవారు ఇటువైపు అడుగులు వేస్తున్నారు.



# బీఆర్ఎస్‌లో తోకే కుక్కను ఊపుతోంది!

**అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం హరీశ్‌దా?,బీఆర్ఎస్‌దా?**

**బయట సభలు పెడితే ఎవరు నమ్ముతారు?: కవిత**

**సూర్యాపేట :** సాధారణంగా కుక్క తన తోకను ఊపుతుందని.. కానీ బీఆర్ఎస్‌లో తోకనే కుక్కను ఊపే పరిస్థితి వచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సభ్యులు హరీశ్‌ను తిడితే.. బీఆర్ఎస్ వారందరినీ సభకు రాకుండా హరీశ్‌రావు సొంత నిర్ణయంతో సమావేశాలను బహిష్కరించారని ఆరోపించారు. మరి కాంగ్రెస్ వాళ్లు కేసీఆర్‌ను తిడితే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీఆర్ఎస్‌లో ఓ గ్రూపును తయారు చేసుకుంటున్నారని.. బాయ్‌కాట్ డ్రామా కచ్చితంగా ఆయనదేనని తాను బలంగా నమ్ముతున్నానని చెప్పారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లిలో కవిత మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బహిష్కరించాలన్న నిర్ణయం హరీశ్‌రావు తీసుకున్నదా? లేక బీఆర్ఎస్ పార్టీ నిర్ణయమా? అనేది ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అది కేసీఆర్, కేటీఆర్ నిర్ణయమైతే క్షమించరాని తప్పుచేసినట్లేనని.. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వదిలి బయట సభలు పెడితే ఎవరు నమ్ముతారని పేర్కొన్నారు. ప్రతిపక్షమే లేకుండా సభ జరగడంతో పాలకపక్షం అడ్డగోలుగా అబద్ధాలు చెప్పిందని కవిత ఆరోపించారు. కృష్ణా నదిలో తక్కువ నీటివాటాకు ఒప్పుకొంటూ హరీశ్‌రావు సంతకం చేశారన్న అధికార పక్షం ఆరోపణలపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బండి యాదగిరి రాసిన పాట స్ఫూర్తితో నిజాంపై పోరాటం చేశామని, అదే స్ఫూర్తితో తాను గుంట నక్క మీద యుద్ధం చేస్తున్నానని కవిత చెప్పారు. తాను గుంటనక్క అనే వ్యక్తిని అందరూ హరీశ్‌రావు అంటారని పేర్కొన్నారు. హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి కోపం లేదని, అడ్డగోలుగా అవినీతి చేసినవారిపై తాను మాట్లాడుతూనే ఉంటానని చెప్పారు. జగదీశ్‌రెడ్డి మనుషులకు దేవుళ్లు, చెరువులంటే లెక్క లేదని, వారు ఆక్రమించిన చెరువులపై ఆధారాలతో హైడ్రాకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఉరితీయాలని రేవంత్‌రెడ్డి అంటున్నారని, కృష్ణా జలాల అంశంలో తెలంగాణకు నష్టం చేస్తున్న రేవంత్‌రెడ్డిని రెండుసార్లు ఉరితీయాలని కవిత వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో సీఎం ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాగా, సబ్ జైలు రిమాండ్‌లో ఉన్న సమయంలో అనారోగ్యంతో మృతిచెందిన కోదాడ వాసి కర్ల రాజేశ్ కుటుంబాన్ని కవిత పరామర్శించారు. ఈ ఘటనపై ప్రభుత్వం సరైన విచారణ చేయటం లేదని ఆరోపించారు.

# భస్మాసురునికి సోదరుడు కేటీఆర్

**తెలంగాణను భ్రష్టు పట్టించిందే బీఆర్ఎస్**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**

**హైదరాబాద్, జనవరి 4 :** భస్మాసురుని కజిన్ బ్రదర్ కేటీఆర్ అని, బంగారు తెలంగాణను భ్రష్టు పట్టించిన భస్మాసుర సైన్యం బీఆర్ఎస్ నాయకగణమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు. కేటీఆర్‌లో అహంకారం పరాకాష్టకు చేరుకుందన్నారు. నిరుద్యోగుల ఉసురు తగిలే బీఆర్ఎస్ పార్టీ ఈ దుస్థితికి చేరుకుందని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉందని, అందుకే 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసిందని చెప్పారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురిచేసిన బీఆర్ఎస్ నేతలను శిక్షించాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల ప్రజా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి దిశగా సాగుతోందని తెలిపారు. అందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షమ కార్యక్రమాలు కేటీఆర్‌కు కనిపించట్లేదా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడి ప్రజలతో ఛీకొట్టించుకున్న బీఆర్ఎస్.. పాలమూరు-రంగారెడ్డిలో చేసిన బాగోతమూ బయటపడుతుందని చెప్పే అసెంబ్లీ నుంచి పారిపోయిందని మండిపడ్డారు. ఈ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకే కేటీఆర్ చౌకబారు ప్రకటనలు చేస్తున్నారన్నారు. ముందుగా కవిత చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పి ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ గురించి మాట్లాడాలన్నారు. ఎవరిని ఉరితీయాలో ప్రజలు ఇప్పటికే పలు ఎన్నికల్లో నిరూపించారని, అయినా మారకుంటే ఈసారి తరిమికొడతారని హెచ్చరించారు.

### 8న టీపీసీసీ విస్తృత సమావేశానికి సీఎం రేవంత్

ఈనెల 8న టీపీసీసీ విస్తృత సమావేశం గాంధీభవన్‌లో జరగనుంది. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అధ్యక్షతన జరగనున్న ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్ష నటరాజన్, కార్యవర్గం, డీసీసీ అధ్యక్షులు పాల్గొంటారు. డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులతో ఆదివారం జరిగిన జూమ్ మీటింగ్‌లో మహేశ్ గౌడ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు.

# కేసీఆర్ ఫాంహౌస్ ఎదుట ముంపు బాధితుల ధర్నా

**మద్దతు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు**

**మర్కుక్, జనవరి 4 :** సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షత్రం వద్ద ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఈ ఆందోళనకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టుల బాధితులకు నేటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని విమర్శించారు. రైతులకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని, మెరుగైన పునరావాస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ బాధితుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. కేసీఆర్ ఫాంహౌ అబశ్రీశ్రీసలోనే ఉండడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భారీగా మోహరించి భద్రతను పర్యవేక్షించారు.



# తమిళనాడులో 2026లో ఎన్డీఏదే అధికారం

**స్టాలిన్ గురి కొడుకు పట్టాభిషేకంపైనే.. ప్రజా సమస్యలపై కాదు**

**దేశంలోనే అత్యంత అవినీతి సర్కార్ డీఎంకేదే**

**ఉదయనిధి సీఎం కావాలనే కల నెరవేరదు : కేంద్ర మంత్రి అమిత్ షా ధ్వజం**

**చెన్నై/తిరుచిరాపల్లి :** తమిళనాడులో ద్రావిడ పార్టీల ఆధిపత్యానికి తెరపడనుందని, కుటుంబ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. 2026 ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం తమిళనాడుకు వచ్చిన అమిత్ షా.. తిరుచిరాపల్లిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అధికార డీఎంకే ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి స్టాలిన్‌పై ఆయన నిప్పులు చెరిగారు.

**అవినీతికి కేరాఫ్ అడ్రస్.. డీఎంకే**

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతిమయమైన ప్రభుత్వమని అమిత్ షా అభివర్ణించారు. రాష్ట్రం క్లిష్టమైన సమస్యలతో సతమతమవుతుంటే.. ప్రభుత్వం మాత్రం వాటిని పరిష్కరించడం మానేసి అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, స్టాలిన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కొడుకు కోసమే తపన..**

ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజల సంక్షమాన్ని గాలికి వదిలేశారు. ఆయన దృష్టి అంతా తన కొడుకు ఉదయనిధి స్టాలిన్‌ను తదుపరి ముఖ్యమంత్రిని చేయడంపైనే ఉంది. వారసత్వ రాజకీయాలకే డీఎంకే పెద్దపీట వేస్తోంది. మొదట కరుణానిధి, ఆ తర్వాత స్టాలిన్, ఇప్పుడు ఉదయనిధి ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్నారు. కానీ ఆ కలలు ఇక నెరవేరవు. తమిళనాడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారు,c అని అమిత్ షా వ్యాఖ్యానించారు. 2026 అసెంబ్లీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం మాదేనని బీజేపీ కార్యకర్తలకు అమిత్ షా భరోసా ఇచ్చారు. తమిళనాడులో ఇప్పటివరకు అందని ద్రాక్షగా మిగిలిన అధికారాన్ని ఈసారి ఎలాగైనా దక్కించుకోవాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. ఎన్నికలకు ఇంకా కొన్ని నెలల సమయం ఉన్నప్పటికీ.. ఇప్పటి నుంచే క్షత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. అందులో భాగంగానే అమిత్ షా పర్యటన, పాదయాత్రల ముగింపు సభలు కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయి.

# వరిధాన్యం ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే నంబర్ 1

**15 కోట్ల టన్నుల దిగుబడితో చైనా కన్నా ముందంజ: శివరాజ్ సింగ్**

**న్యూఢిల్లీ :** వరిధాన్యం ఉత్పాదనలో భారత్ ప్రపంచ ఖ్యాతిని ఆర్జించింది. చైనాను అధిగమించి ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలిచింది. మొత్తంగా 15.01 కోట్ల టన్నుల వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసి ఈ ఘనత సాధించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం వెల్లడించారు. నూతన విత్తనాలను ఆవిష్కరించిన సందర్భంగా ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో రూపొందించిన 25 పంటలకు సంబంధించిన 184 రకాల అధిక దిగుబడి విత్తనాలను ఆయన విడుదల చేశారు. ఆహార కొరత ఉన్న స్థితి నుంచి ప్రపంచానికే ఆహారం అందించే స్థాయి వరకు దేశం ఎదిగిందని, ఇది ఘన విజయమని ప్రశంసించారు. "వరి ఉత్పత్తిలో భారత్..చైనాను అధిగమించింది. ప్రపంచంలోనే అత్యధిక వరి ఉత్పత్తిదారుగా ఎదిగింది. చైనా 14.52 కోట్ల టన్నుల వరిని ఉత్పత్తి చేయగా, భారత్ 15.01 కోట్ల టన్నులను ఉత్పత్తి చేసింది" అని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, దేశంలో సమృద్ధిగా బియ్యం నిల్వలు ఉన్నాయని చెప్పారు. నూతనంగా విడుదల చేసిన విత్తనాలను వెంటనే రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని శివరాజ్ సింగ్ అధికార్లను కోరారు. నూతనంగా అభివృద్ధి చేసిన విత్తనాలకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం 1969లో ప్రారంభమయిందని చెప్పారు. ఇంతవరకు 7,205 రకాల విత్తనాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు తెలిపారు. 1969 నుంచి 2014 వరకు 3,969 విత్తనాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, మోదీ ప్రభుత్వం హయాంలో 3,236 అధిక దిగుబడి విత్తనాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు వివరించారు.

# ప్రియాంక చేతికి అసోం బాధ్యత

**ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకం**

**నలుగురు సభ్యులతో కాంగ్రెస్ కమిటీ..**

**మార్చి, ఏప్రిల్లో జరగనున్న అసోం ఎన్నికలు**

**ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి కాంగ్రెస్ పోటీ**



**గువాహటి/న్యూఢిల్లీ :** రాబోయే అసోం అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షంచే స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా వాద్రా నియమితులయ్యారు. ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్న అసోం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరికి సంబంధించి పార్టీ అధిష్ఠానం శనివారం రాత్రి స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ కమిటీల వివరాలను వెల్లడిస్తూ, అసోం కమిటీకి ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. ఇక కేరళ స్క్రీనింగ్ కమిటీకి మధుసూదన్ మిస్త్రీ, తమిళనాడు, పుదుచ్చేరికి టీఎస్ సింగ్ దేవ్, బెంగాల్‌కు బీకే హరిప్రసాద్ చైర్మన్లుగా నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి స్క్రీనింగ్ కమిటీలో రాజ్యసభ ఎంపీ మందాడి అనిల్‌కుమార్ యాదవ్ సభ్యుడిగా నియమితులయ్యారు.

# ఒలింపిక్ కల సాకారం చేద్దాం


## 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తాం

**వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ చాంపియన్ షిప్**

**క్రీడాకారులను ఉద్దేశించి వర్చువల్గా ప్రసంగించిన ప్రధాని మోడీ**

**2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్లోనే**

**భవిష్యత్లో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్లపై మోడీ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ:** 2036 ఒలింపిక్ పూర్తిస్థాయిలో ఆతిథ్యమిచ్చే దిశగా బిడ్ చేయడానికి భారత్ చురుకుగా సన్నాహాలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వారణాసి (కాశీ)లో 72వ సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్ షిప్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆదివారం ప్రారంభించారు.

**సమన్వయం, సహకారంతో వాలీబాల్**

కాశీ ఎంపీగా ఉన్న నేను, దేశవ్యాప్తంగా వచ్చిన అందరు ఆటగాళ్లకు స్వాగతం పలుకుతున్నాను. అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ రోజు కాశీలో నేషనల్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ ప్రారంభమవుతోంది. మీరందరూ చాలా కష్టపడి ఈ జాతీయ స్థాయి టోర్నమెంట్కు చేరుకున్నారు. వాలీబాల్ సాధారణ ఆట కాదు. ఇది సమతూకం, సహకా రంతో కూడుకున్న ఆట. నిర్ణయాత్మకతను కూడా చూపి స్తుంది. వాలీబాల్లో విజయం ఒంటరిగా సాధ్యం కాదు. టీ మ్ గెలిచినప్పుడే అందరూ గెలుస్తారు. మన విజయం సమన్వయం, నమ్మకం, టీమ్ సిద్ధతపై ఆధారపడి ఉంటు ంది. ప్రతి ఒక్కరికీ పాత్ర ఉంటుంది, బాధ్యత ఉంటుంది.

**అందరిలో ఇండియా ఫస్ట్ భావన**

ఇండియా ఫస్ట్ భావనతో ప్రతి వ్యక్తి పనిచేస్తున్నాడు. 28 రాష్ట్రాల నుంచి టీమ్లు పాల్గొంటున్నాయి. ఇది ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తికి అద్దం పడుతోంది. గత దశాబ్దకాలంలో దేశంలోని వివిధ నగరాల్లో ఫిఫా అండర్-17 వరల్డ్ కప్, హాకీ వరల్డ్ కప్, పెద్ద చదరంగ టోర్నమెంట్లు వంటి 20కి పైగా పెద్ద అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలు జరిగాయి అని మోడీ చెప్పారు. 2030 కామన్వెల్త్ గేమ్స్ భారత్లో 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్ లో జరగనున్నాయి. ఇప్పుడు 2036 ఒలింపి క్స్కు పూర్తి స్థాయిలో ఆతిథ్య మిచ్చే దిశగా బిడ్ చేయడా నికి భారత్ చురుకుగా సన్నాహాలు చేస్తోంది. క్రీడల కేంద్రంగా కాశీ ఎదుగుతోందని, టోర్నమెంట్ను నగర ప్ర జల ఉత్సాహం విజయవంతం చేస్తుంద నే విశ్వాసం ఆయన వ్యక్తం చేశారు.

# చేతులకు బేడీలతో జైలుకు మదురో



**కరుడుగట్టిన ఖైదీలా మదురోను తరలించిన అధికారులు**

**డ్రగ్స్ ఉగ్రవాద ఆరోపణలు రుజువైతే జీవితకాలం జైల్లోనే..**

**అమెరికా అధికారులకు మదురో న్యూఇయర్ శుభాకాంక్షలు**

**మీకూ అదే గతి.. క్యూబా, చిలీ, కొలంబియాలకు ట్రంప్ హెచ్చరిక**

**రష్యా కూడా జెలెన్స్కీని ఇలాగే బంధిస్తే ఏం చేస్తారు?**

**ట్రంప్ తీరును ప్రశ్నించిన ఆ దేశ ప్రజాప్రతినిధి రో ఖన్నా**

**అమెరికా దాడిలో 40 మంది మరణించారు: వెనెజువెలా**

**న్యూయార్క్ :** అర్ధరాత్రి మిలిటరీ ఆపరేషన్‌తో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించిన అమెరికా.. ఆయనను కరుడుగట్టిన నేరస్థుడి మాదిరిగా చేతులకు బేడీలు వేసి జైలుకు తరలించింది. చేతులకు బేడీలు, తలపై నల్లని వస్త్రంలాంటి టోపీతో ఉన్న మదురోను రెండువైపులా ఇద్దరు అధికారులు పట్టుకొని జైల్లోకి నడిపించుకొని తీసుకెళ్తున్న వీడియోను అమెరికా మీడియా ఆదివారం ప్రసారం చేసింది. మదురోను న్యూయార్క్‌లోని ప్రఖ్యాత బ్రూక్లిన్ జైలు (మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్)కు తరలించారు. ఈ జైలు కరుడుగట్టిన నేరస్థులకు కేంద్రం. ఇందులో ప్రస్తుతం 1,300 మంది ఖైదీలు ఉన్నారు. సాధారణ నేరాలు చేసి వచ్చే ఖైదీలను.. పోలీసులు కోరినా ఈ జైలుకు పంపేందుకు న్యాయమూర్తులు అంగీకరించరు. కాగా, న్యూయార్క్ దక్షణ జిల్లా ఫెడరల్ కోర్టులో మదురోపై మత్తుపదార్థాల ఉగ్రవాదానికి కుట్ర, అక్రమంగా మత్తుపదార్థాలను అమెరికాలోకి రవాణా చేసేందుకు కుట్ర పన్నటం, అక్రమ ఆయుధాల వ్యాపారం తదితర నేరాలకు సంబంధించిన అభియోగాలు మోపినట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండీ తెలిపారు. ఈ అభియోగాలన్నీ రుజువైతే మదురో జీవితకాలం మొత్తం జైల్లోనే ఉండాల్సి రావచ్చని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. పైగా మదురోకు సంబంధించిన ఆస్తులన్నీ అమెరికా జప్తు చేస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా తనను నిర్బంధంలోకి తీసుకున్న లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు మదురో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపటం విశేషం.

**జెలెన్స్కీని ఇలాగే బంధిస్తే?**

మదురోను అమెరికా సైన్యం అపహరించటాన్ని ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు, భారత సంతతి డెమోక్రాటిక్ నేత రో ఖన్నా తీవ్రంగా ఖండించారు. ట్రంప్ అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కుతూ మిలిటరిజంను ప్రోత్సహిస్తున్నారని ఆదివారం ఆయన ఆరోపించారు. 'తైవాన్ అధ్యక్షుడు లైచింగ్ తేను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇలాగే బంధించాలనుకుంటే మనం ఇప్పుడు ఏం చేయగలం? ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ఇలాగే అపహరిస్తే ఎలా ప్రశ్నించగలం? ట్రంప్ ప్రభుత్వ యుద్ధోన్మాదం, రక్షణ బడ్జెట్ పెంపు విధానాలకు వ్యతిరేకంగా అమెరికా ప్రజలు గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైంది. మన ప్రభుత్వానికి సరైన మార్గం చూపేందుకు ఇప్పుడు మనకు ఒక రాజనీతిజ్ఞుడు అవసరం' అని పేర్కొన్నారు.

**వెంటనే విడుదల చేయండి: చైనా**

నికోలస్ మదురోను వెంటనే విడుదల చేయాలని అమెరికాను చైనా డిమాండ్ చేసింది. మదురోను, ఆయన సతీమణి సిలియా ఫ్లోరిఅబఠ్రీశ్రీసను అమెరికా సైన్యం బలవంతంగా ఎత్తుకుపోవటంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మదురో దంపతులను వదిలేసి, వెనెజువెలా ప్రభుత్వాన్ని కూలదోసే చర్యలను మానుకోవాలని చైనా విదేశాంగశాఖ ఆదివారం ఒక ప్రకటనలో సూచించింది. కాగా, ఈ అంవంపై భారత్ ఆచితూచి స్పందించింది. చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భారత విదేశాంగశాఖ పేర్కొంది. వెనెజువెలా, అమెరికాలు తమ మధ్య ఉన్న విబేధాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది.

**వెనెజువెలాను మేం పాలించం: అమెరికా**

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధించి తీసుకెళ్లాక.. ఆ దేశాన్ని ఇకపై తామే పాలిస్తామని చెప్పిన అమెరికా మరుసటి రోజే యూటర్న్ తీసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు విరుద్ధంగా.. వెనెజువెలా రోజువారీ పాలనలో తాము జోక్యం చేసుకోబోమని అమెరికా మంత్రి మార్కో రుబియో ఆదివారం ప్రకటించారు. అయితే ఆ దేశంలో చమురు ఆంక్షలను మాత్రం తాము పర్యవేక్షస్తామన్నారు.

**తర్వాతి వంతు మీదే..**

ట్రంప్ ఇతర లాటిన్ అమెరికా దేశాలకు కూడా తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. అమెరికాలోకి డ్రగ్స్ అక్రమ రవాణాను ఆపకపోతే వెనెజువెలాకు పట్టిన గతే మీకూ పడుతుందని క్యూబా, చిలీ, కొలంబియా అధినేతలను హెచ్చరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఇదేరకమైన హెచ్చరిక చేశారు. మదురోను నిర్బంధించటాన్ని ఈ మూడు దేశాలు తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.

**వెనెజువెలా అధ్యక్షరాలిగా డెల్సీ**

అధ్యక్షుడు మదురోను అమెరికా అపహరించటంతో వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షరాలిగా ఆ దేశ ఉపాధ్యక్షరాలు డెల్సీ రోడ్రిగ్స్‌ను ఆ దేశ సుప్రీంకోర్టు ఆదివారం నియమించింది. అధ్యక్షుడు లేని దేశంలో పాలన గాడి తప్పకుండా కొనసాగించేందుకు, దేశ భద్రతను కాపాడేందుకు తక్షణం ఆమెను అధ్యక్ష పగ్గాలు చేపట్టాల్సిందిగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కోరింది. కాగా, అమెరికా దాడిలో 40 మంది మరణించారని వెనెజువెలా ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. వీరిలో సాధారణ పౌరులు కూడా ఉన్నట్లు వెల్లడించింది.

# నైట్ స్టాకర్స్ తోడుగా..డెల్టా ఫోర్స్ ముందుండి!

## అమెరికా అత్యున్నత దళాలతో వెనెజువెలాలో ఆపరేషన్

**వాషింగ్టన్ :** నాలుగు నెలల ప్రణాళిక.. ఒకటికి పది సార్లు పక్కాగా నిఘా.. సమయం చిక్కగానే రంగంలోకి అత్యున్నత దళమైన డెల్టాఫోర్స్.. దానికితోడుగా శత్రువులకు ఏమాత్రం చిక్కకుండా రాత్రివేళల్లో అత్యంత సమర్థవంతంగా దాడులు చేసే నైట్ స్టాకర్స్ వైమానిక దళం.. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను పట్టుకెళ్లేందుకు అమెరికా అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన తీరు ఇది. అధ్యక్ష భవనంలోకి చొరబడిన తర్వాత కేవలం 5నిమిషాల్లోనే మదురోను, ఆయన భార్యను అమెరికన్ దళాలు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. అమెరికా నావికాదళం, నైట్ స్టాకర్స్ వైమానిక దళం, డెల్టాఫోర్స్ పదాతిదళం మూడూ పూర్తి సమన్వయంతో అత్యంత విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేశాయి. ఆపరేషన్‌లో భాగంగా.. డ్రగ్స్ ముఠాను అరికట్టడానికంటూ అమెరికా కరీబియన్ సముద్రంలో వెనెజువెలాకు దగ్గరగా యుద్ధ నౌకలను, దళాలను మోహరించింది. నిజానికి మదురోను అరెస్టు చేయడం కోసం వెనెజువెలా తీరానికి దగ్గరగా అమెరికా చేసుకున్న ఏర్పాట్లు అవి. ఆ యుద్ధ నౌకల నుంచి నిఘాకు దొరకని స్టెల్త్ డ్రోన్లను వెనెజువెలా రాజధాని కారక్సపైకి పంపి.. మదురో ఉండే అధ్యక్ష భవనం, సమీప ప్రాంతాలు, ఆయన కదలికలపై అమెరికా నిఘా పెట్టింది. అమెరికా నిఘా సంస్థ సీఐఏ గూఢచారులను కూడా వెనెజువెలాలోకి పంపింది. మదురో కదలికల వివరాలు తెలిసిన వెనెజువెలా అధికారులు, నేతలకు గూఢచారులు ఎరవేసి సమాచారం సేకరించారు. ఇలా ఆగస్టు నుంచి సుమారు 4నెలలపాటు వివరాలన్నీ సేకరించి.. పక్కాగా ప్రణాళిక రూపొందించారు. అమెరికాలోని కెంటకీలో అచ్చం మదురో ఉండే భవనం తరహా నమూనాను సృష్టించారు. ఎక్కడి నుంచి ప్రవేశించి, ఎలా ముందుకెళ్లాలి, మదురోను పట్టుకొన్నాక ఎలా బయటికి రావాలి, ఎలా తరలించాలనేది ప్రాక్టీసు చేశారు.

**ట్రంప్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే..**

మదురోను పట్టుకుని, తీసుకెళ్లేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి శుక్రవారం రాత్రి 10.46కు (స్థానిక కాలమానం ప్రకారం) గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. రాగానే రక్షణశాఖ ఉన్నతాధికారులు 'ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వ్' ప్రారంభించారు. అత్యున్నత సైనిక దళం 'డెల్టా ఫోర్స్'ను, దానికి సహాయకంగా నైట్ స్టాకర్స్‌ను రంగంలోకి దింపారు. 20 యుద్ధ నౌకల నుంచి సుమారు 150 ఫైటర్లు, బాంబర్లు, నిఘా విమానాలు వెనెజువెలా గగనతలంలోకి ప్రవేశించాయి. కారక్సలో క్షపణి, యుద్ధ విమాన రక్షక వ్యవస్థలను, విద్యుత్ వ్యవస్థలను ధ్వంసం చేశాయి. ఆ వెంటనే నైట్ స్టాకర్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎంహెచ్-60, ఎంహెచ్-47 హెలికాప్టర్లలో డెల్టా ఫోర్స్ కమెండోలు బయలుదేరారు. ఫోర్ట్ ట్యూనా మిలటరీ కాంప్లెక్స్‌లోని వెనెజువెలా అధ్యక్షభవనంపై అర్ధరాత్రి 1.01 గంటల సమయంలో దిగారు.

# ఈ-పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారా..

## ఎలాచేయాలి.. ఎవరు అర్హులు..

పలు దేశాలు ఎప్పటినుంచో అమలు చేస్తున్న ఈ-పాస్‌పోర్ట్ ను ఇటీవల ఇండియా కూడా అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియ సులభం అవుతుంది. అలాగే.. ఎయిర్ పోర్టుల్లో వేగంగా స్కానింగ్, తనిఖీ చేయడానికి వీలవుతుంది. పాస్-పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఈ-పాస్‌పోర్ట్ ను ప్రవేశపెట్టగా ఇప్పటికే ఇండియాలో ఉంటున్న 80 లక్షల మందికి, విదేశాల్లో ఉంటున్న 62 వేల మందికి జారీ చేశారు.

### ఈ-పాస్‌పోర్ట్ అంటే ఏంటి..

ఇది కూడా సాధారణ పాస్‌పోర్ట్ లాంటిదే. అయితే, ఇది ఎలక్ట్రానిక్ డివైజ్ ఆధారంగా పని చేస్తుంది. ఈ పాస్‌పోర్ట్ బ్యాక్ కవర్లో ఒక చిప్ ఉంటుంది. ఈ చిప్ లో పాస్‌పోర్ట్ దారుడి బయోమెట్రిక్ వివరాలు.. అంటే ఫింగర్ ప్రింట్స్, ఫేసియల్ రికగ్నిషన్, డిజిటల్ సైన్ వంటివి ఉంటాయి. పైగా ఈ చిప్ ను ట్యాంపర్ చేయడానికి వీల్లేదు. ఎయిర్ పోర్టుల్లో సాధారణంగా పాస్‌పోర్ట్ బుక్ ను పరిశీలిస్తారు. అందులో ఫొటో, సంతకం వంటివి సిబ్బంది తనిఖీ చేస్తారు. వాటిని సరిచూసుకోవడానికి చాలా సమయం పడుతుంది. అయితే, ఈ-పాస్‌పోర్ట్ ద్వారా అలా స్కాన్ చేయగానే పూర్తి వివరాలు డిజిటల్ స్క్రీన్ పై ప్రత్యక్షమవుతాయి. దీంతో సంబంధిత వ్యక్తిని పోల్చుకోవడం, స్కానింగ్ చేయడం సులభమవుతుంది. ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. ఈ-పాస్‌పోర్ట్ డాక్యుమెంట్ వెనుక భాగంలో ఒక గోల్డ్ కలర్ సింబల్ ఉంటుంది. దీని ద్వారా ఇది చిప్ ఎనేబుల్డ్ పాస్‌పోర్ట్ అని గుర్తించవచ్చు.







### ఎలా దరఖాస్తు చేసుకోవాలి

భారతీయులు ఎవరైనా సరే.. ఈ-పాస్‌పోర్ట్ కు కూడా సాధారణ పాస్‌పోర్ట్ లాగే దరఖాస్తు చేసుకోవాలి. 36 పేజీల బుక్ లెట్ కోసం రూ.1,500, 60 పేజీల బుక్ లెట్ కోసం రూ.2,000 చెల్లించాలి. దీని దరఖాస్తు కోసం ప్రత్యేక కేటగిరి అంటూ ఏమీ లేదు. ప్రస్తుతం ఈ-పాస్‌పోర్ట్ సేవ కొన్ని కేంద్రాల్లోనే అందుబాటులో ఉంది. త్వరలోనే మరిన్ని కేంద్రాలకు ఈ సేవను విస్తరించనుంది. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారితోపాటు, రెన్యువల్ చేసుకునేవాళ్లు కూడా ఈ-పాస్‌పోర్ట్ పొందొచ్చు.

# బీఈఎల్ జాబ్ నోటిఫికేషన్.. లాస్ట్ డేట్ ఎప్పుడంటే..



భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (BEL) ట్రైనీ ఇంజనీర్ ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే అప్లికేషన్స్ మొదలవగా.. జనవరి 9, 2026 వరకు అప్లై చేసుకునేందుకు అవకాశం ఉంది. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. ఈ నియామక ప్రక్రియ కింద దీజూా వివిధ విభాగాలలో మొత్తం 119 ఖాళీలను భర్తీ చేయనుంది.

ట్రైనీ ఇంజనీర్-× కి ఎలక్ట్రానిక్స్‌లో 65 పోస్టులు ఉన్నాయి. వాటిలో జనరల్ కేటగిరీకి 30, OBCకి 20, EWS కి 4, SCకి 7, ST కి 4 రిజర్వ్ చేశారు. కంప్యూటర్ సైన్స్‌లో మొత్తం 6 పోస్టులు ఉన్నాయి. వీటిలో EWSకి 3, ST కేటగిరీలకు 3. మెకానికల్ ఇంజనీరింగ్‌లో 37 పోస్టులు ఉన్నాయి. వీటిలో జనరల్‌కు 15, OBCకి 10, EWS కి 3, SC కి 6, STకి 3. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 8 పోస్టులు ఉన్నాయి. వీటిలో జనరల్‌కు 4, OBCకి 2, EWSకి 1, SC కేటగిరీకి 1 పోస్ట్ రిజర్వ్ అయ్యాయి. అలాగే కెమికల్ ఇంజనీరింగ్‌లో జనరల్ కేటగిరీకి 1 పోస్ట్ మాత్రమే రిజర్వ్ చేశారు. ట్రైనీ ఆఫీసర్-× (ఫైనాన్స్) లో 2 పోస్టులు ఉన్నాయి. వీటిలో SCకి 1, EWS అభ్యర్థులకు 1 పోర్ట్ రిజర్వ్ చేశారు.

ఈ జాబ్‌కు అప్లై చేసే అభ్యర్థులు రూ. 150 అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి జీఎస్టీ కూడా యాడ్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజును SBI కలెక్ట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలి. SC, ST, PwBD కేటగిరీ అభ్యర్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

**అర్హతలు..**

అభ్యర్థులు గుర్తింపు పొందిన సంస్థ, విశ్వవిద్యాలయం, కాలేజీ నుండి సంబంధిత విభాగంలో నాలుగు సంవత్సరాల BE, B.Tech., B.Sc. ఇంజనీరింగ్ డిగ్రీని కలిగి ఉండాలి. జనరల్, EWS కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితి జనవరి 1, 2026 నాటికి 28 సంవత్సరాలు. మరిన్ని వివరాల కోసం బీఈఎల్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్ష తేదీ మార్పు

### పదో తరగతి పరీక్ష మార్చి 11కు..12వ తరగతి పరీక్ష ఏప్రిల్ 10కి రీషెడ్యూల్

సీబీఎస్ఈ 10, 12వ తరగతుల పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చేసింది. పది, 12 తరగతుల విద్యార్థులకు మార్చి 3న జరగాల్సిన పరీక్షలను రీషెడ్యూల్ చేసింది. పాలనాపరమైన కారణాలతో ఈ పరీక్ష షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు బోర్డు ప్రకటించింది. మార్చి 3న పదో తరగతి విద్యార్థులకు జరగాల్సిన పరీక్షను మార్చి 11కుబీ 12వ తరగతి విద్యార్థులకు జరగాల్సిన పరీక్షను ఏప్రిల్ 10కి మార్చినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. మిగతా పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పూ లేదని స్పష్టం చేసింది. ఇతర పరీక్షలన్నీ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జర్గుగుతాయని తెలిపింది. ఫిబ్రవరి 17 నుంచి సీబీఎఅబశ్రీశ్రీసఈ పది, 12వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. అయితే, తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 3న పదో తరగతి విద్యార్థులకు టిబెటన్, జర్మన్, నేషనల్ క్యాడెట్ కార్ప్స్, భోటి, బోడో, తంగ్‌ఖుల్, జపనీస్, భుటియా, స్పానిష్, కశ్మీరీ, మిజో, బహసా మెలయు, ఎలిమెంట్స్ ఆఫ్ బుక్ కీపింగ్ అండ్ అకౌంటెన్సీ వంటి పరీక్షలు జరగాల్సి ఉండగా.. 12వ తరగతి విద్యార్థులకు లీగల్ స్టడీస్ పరీక్ష ఉంది. తాజాగా ఈ పరీక్షల తేదీ మారింది. ఆయా పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఎలాంటి గందరగోళం లేకుండా వీలైనంత త్వరగా ఈ సమాచారాన్ని తెలియజేయాలని పాఠశాలలను బోర్డు కోరింది. రీషెడ్యూల్ చేసిన తేదీలను గమనించి, అందుకు అనుగుణంగా పరీక్షకు సిద్ధమవ్వాలని సూచించింది.



# ఫిబ్రవరి 28 నుంచి యూటీఎస్ యాప్ నిలిపివేత

అన్ రిజర్వ్‌డ్, ఫ్లాట్‌ఫారం టికెట్ల బుకింగ్ కోసం ప్రస్తుతం ప్రయాణికులు వాడుతున్న 'యూటీఎస్' యాప్‌ను ఫిబ్రవరి 28 నుంచి నిలిపివేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. దీని స్థానంలో మార్చి 1 నుంచి 'రైల్‌వన్' అనే కొత్త అప్లికేషన్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా ప్రవేశపెట్టిన ఈ యాప్ ద్వారా ఇకపై రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్లతో పాటు సీజన్ టికెట్ల బుకింగ్, రెన్యూవల్, రిఫండ్ వంటి అన్ని రకాల సేవలను ఒకే చోట పొందవచ్చు. వేర్వేరు టికెట్ల కోసం వేర్వేరు యాప్‌లను వాడాల్సిన అవసరం లేకుండా, అన్ని సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంపై ప్రయాణికుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.




# 20 శాతం పెరగనున్న స్మార్ట్ ఫోన్ల ధరలు.. అసలు కారణమిదే..

త్వరలో దాదాపు 20 శాతం వరకు స్మార్ట్ ఫోన్ల ధరలు పెరగనున్నాయి. అయితే, ఇండియాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఫోన్ల ధరలు పెరిగే అవకాశం ఉందని స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థలు చెబుతున్నాయి. దీనికి కారణం.. ఫోన్లలో వాడే మెమరీ చిప్స్ కు డిమాండ్ పెరగడమే. ఇటీవల ఏఐ సంస్థలు మార్కెట్లో దూసుకెళ్తున్న సంగతి తెలిసిందే. ఏఐ టెక్నాలజీ వాడాలంటే మెమరీ చిప్స్ అవసరం. దీంతో మెమరీ చిప్స్ కోసం ఆయా సంస్థలు 2027 వరకు భారీగా బుకింగ్స్ చేస్తున్నాయి.

ఏఐ సంస్థలకు కూడా చిప్స్ సరఫరా చేస్తుండటంతో, డిమాండ్ పెరిగి వీటి ధరలు మూడు రెట్లు పెరిగాయి. ఈ ప్రభావం స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, స్మార్ట్ టీవీలు వంటి డివైజ్ తయారీ సంస్థలపై పడింది. ఈ డివైజుల్లో ర్యామ్, ఎస్ఎస్డీ కార్డుల తయారీల్లో ఈ చిప్స్ ఉపయోగిస్తారు. ఈ చిప్స్ వినియోగంలో 70 శాతం మార్కెట్ తో ముందున్న శాంసంగ్ మాత్రం ఏడాది ఉత్పత్తికి సరిపడా చిప్స్ బుకింగ్ చేసుకున్నట్లు సంస్థ తెలిపింది. అయితే, ప్రస్తుతం చిప్స్ కు మరింత డిమాండ్ పెరగడం, లభ్యత తగ్గడం వంటి కారణాలతో భవిష్యత్తులో కూడా స్మార్ట్ డివైజ్ లు, మెమరీ కార్డ్స్, ఎస్ఎస్డీ కార్డులు వంటివి తక్కువ ధరలో లభ్యం కాకపోవచ్చని మార్కెట్ నిపుణులు అంటున్నారు.

ఈ నేపథ్యంలో డెల్, ఏసస్, లెనోవో వంటి సంస్థలు కూడా 5 నుంచి 20 శాతం ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే, శాంసంగ్, యాపిల్ సంస్థలపై ఈ ప్రభావం పెద్దగా పడకపోవచ్చు. కారణం.. ఈ సంస్థలు కొన్నేళ్ల అవసరాలకు సరిపడా చిప్స్ అందించాలని ఆయా సంస్థలతో ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాయి.



# బీసీసీఐ X బీసీబీ..

## క్రికెట్ బోర్డుల మధ్య వైరం

**టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత్‌లో ఆడలేం**
**శ్రీలంకకు మార్చాలంటూ ఐసీసీకి బీసీబీ విజ్ఞప్తి**
**ఐపీఎల్ నుంచి రెహమాన్‌ను తొలిగించడంపై వివాదం**




ఢాకా : భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో క్రికెట్ వ్యవహారాలు కొత్త మలుపు తీసుకున్నాయి. గత కొన్ని నెలలుగా అన్చిశితి వాతావరణంతో కొట్టుమిట్టాడుతున్న బంగ్లాదేశ్‌లో క్రికెట్‌ను పావుగా మార్చుకుంటూ భారత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఓవైపు మైనార్టీ హిందువులను విచక్షణా రహితంగా చంపేస్తూ రాక్షసానందం పొందుతున్న బంగ్లా తాజాగా బీసీసీఐ లక్ష్యంగా పావులు కదుపుతున్నది. ఐపీఎల్ నుంచి తమ దేశ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తీసివేయడాన్ని బూచిగా చూపిస్తూ త్వరలో భారత్‌లో మొదలయ్యే టీ20 ప్రపంచకప్ టోర్నీకి తమ దేశ జట్టును పంపించమంటూ బంగ్లా క్రికెట్ బోర్డు(బీసీబీ) సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. తమ దేశ క్రికెటర్ల భద్రత దృష్ట్యా బంగ్లా ఆడే మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలంటూ కొత్త పల్లవి అందుకుంది. ముస్తాఫిజుర్‌ను తీసేయాలంటూ కేకేఆర్ మేనేజ్‌మెంట్‌ను బీసీసీఐ ఆదేశించిన కొన్ని గంటల వ్యవధిలోనే అటు బంగ్లా అధికార వర్గాలతో పాటు బీసీబీ సభ్యులు హుటాహుటిన సమావేశమై..భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారు.

శనివారం సాయంత్రమే సమావేశమైన ఆ దేశ క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్..బంగ్లాదేశ్ జట్టు ఎట్టి పరిస్థితుల్లో భారత్‌లో పర్యటించేది లేదని స్పష్టం చేశాడు. దీన్ని ఆసారాగా చేసుకుంటూ కొన్ని గంటల వ్యవధిలోనే నజ్రుల్ మాటలకు వంతపాడుతూ బీసీబీ పెద్దలు అధికారికంగా ఒక ప్రకటన వెలువరించారు. మెగాటోర్నీకి ముందు భారత్‌తో పాటు బీసీసీఐని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. అందుకు అనుగుణంగా ఫిబ్రవరి 7వ తేదీన భారత్‌లో మొదలయ్యే టీ20 ప్రపంచకప్ టోర్నీకి తమ జాతీయ జట్టును పంపవద్దని బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. 'గడిచిన 24 గంటలుగా జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం. భారత్‌లో బంగ్లాదేశ్ ఆడే మ్యాచ్‌ల పరిస్థితిపై చర్చించాం. ప్రస్తుత పరిస్థితుల్లో తమ దేశ క్రికెటర్లతో పాటు సహాయక సిబ్బందికి భద్రత విషయంలో ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తాం. వారి సూచనలకు అనుగుణంగా భద్రతా కారణాల రిత్యా మెగాటోర్నీ కోసం భారత్‌లో పర్యటించవద్దన్న నిర్ణయానికి వచ్చాం. అక్కడ జరిగే మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలంటూ ఐసీసీకి విజ్ఞప్తి చేస్తున్నాం' అని బీసీబీ పేర్కొంది.

### మా మ్యాచ్‌లు లంకకు మార్చండి : బీసీబీ

ప్రస్తుతం భారత్, బంగ్లాదేశ్ మధ్య రాజకీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను అక్కడి నుంచి శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి బీసీబీ ప్రాథమికంగా విజ్ఞప్తి చేసింది. మెగాటోర్నీని నిర్వహించే ఐసీసీ ఈ విషయంలో కలుగజేసుకోవాలని కోరింది. సాధ్యమైనంత తొందరగా దీన్ని పరిష్కరించాలంటూ లేఖలో అభ్యర్థించే ప్రయత్నం చేసింది. అయితే ఇప్పటికే షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో బంగ్లా మ్యాచ్‌లను తరలించే విషయంలో ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనేది ఆసక్తికరంగా మారింది.

### బీసీబీ కంటే ముందే నిర్ణయం

ఓవైపు ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ రెహమాన్ తీసివేయడాన్ని సాకుగా చూపిస్తూ భారత్‌ను ఇరకాటంలో పెట్టేందుకు బంగ్లా ప్రభుత్వ పెద్దలు పిచ్చి ప్రయత్నాలు చేశారు. దేశ క్రికెట్ బోర్డు కంటే ముందే భేటీ అయ్యి భారత్‌పై బురద చల్లేందుకు ప్రణాళికలు రచించారు. అందులో భాగంగా ఓవైపు తమ దేశ అంతర్గత భద్రతపై అన్ని దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు కొత్త పల్లవి అందుకున్నారు. క్రికెట్ విషయంలో బీసీసీఐ మతాన్ని తీసుకొస్తుందంటూ ఆ దేశ క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్ కొత్త భాష్యం చెప్పాడు. దీన్ని బలపరుస్తూ బెంగాల్ భాషలో తన అధికారిక ఫేస్‌బుక్ పేజీలో వ్యాసం రాసుకొచ్చాడు. ముస్తాఫిజుర్ ఉదంతాన్ని బూచిగా చూపిస్తూ మెగాటోర్నీ కోసం భారత్‌కు రాలేమంటూ ప్రగల్భాలు పలికాడు. అంతటితో ఆగకుండా ఈ విషయాన్ని రాతపూర్వకంగా ఐసీసీ దృష్టికి తీసుకెళ్లాలంటూ బీసీబీకి ఆదేశాలు ఇచ్చినట్లు బిల్డప్ ఇచ్చాడు. బీసీబీతో కాంట్రాక్టు ఉన్న ఏ క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో ఆడకుండా చూడాలంటూ బీసీబీకి సూచించాడు.

### ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం!

బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించేందుకు నజ్రుల్ ప్రయత్నాలు చేస్తున్నాడు. తమ దేశ క్రికెటర్‌ను ఐపీఎల్ నుంచి తీసేసారన్న అక్కసుతో ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారాలను నిషేధించాలంటూ బంగ్లా ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖకు సూచించినట్లు పేర్కొన్నాడు. మొత్తంగా ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తీసివేయడాన్ని అనుకూలంగా మలుచుకుంటూ మెగాటోర్నీ మ్యాచ్‌లకు లింక్ పెడుదామనుకుంటున్న బంగ్లా ఆశలు అడిఆశలయ్యేలా ఉన్నాయి. టీ20 ప్రపంచకప్‌లో ఆడకపోవడం వల్ల నష్టపోయేది బంగ్లానే తప్ప మరొకరు కాదని పలువురు క్రీడాభిమానులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ విషయమై బీసీసీఐ అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఏం జరుగుతుంది అనేది ఆసక్తికరంగా మారింది.

# అరుదైన రికార్డు.. విరాట్ సరసన చేరిన వార్నర్!




ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ డేవిడ్ వార్నర్ మరోసారి తన బ్యాటింగ్‌లో క్లాస్ చూపించాడు. బిగ్‌బాష్ లీగ్ 2025-26 సీజన్‌లో సిడ్నీ థండర్ తరఫున హెూబార్ట్ హరికేన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వార్నర్(ఋుజఱఎ ఝుతీఅవతీ) అద్భుత శతకం సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో టీ20 క్రికెట్‌లో విరాట్ కోహ్లి సరసన ఓ అరుదైన జాబితాలోకి చేరాడు.

జనవరి 3న సిడ్నీ షో గ్రౌండ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సిడ్నీ థండర్‌కు వార్నర్ శుభారంభం అందించాడు. ఇన్నింగ్స్ ఓపెనర్‌గా వచ్చిన అతడు 65 బంతుల్లో 130 పరుగులు చేసి మెరిపించాడు. అతడి ఇన్నింగ్స్‌తో థండర్ జట్టు 20 ఓవర్లలో 205 పరుగుల భారీ స్కోరు సాధించింది.

ఇది వార్నర్ కెరీర్‌లో 9వ టీ20 సెంచరీ. దీంతో టీ20ల్లో అత్యధిక శతకాలు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లి, రీలీ రుసోతో సమానంగా నిలిచాడు. ఈ జాబితాలో క్రిస్ గేల్, బాబర్ ఆజమ్‌లు మాత్రమే వార్నర్ కంటే ముందున్నారు.

### కానీ ఓటమి..

వార్నర్ వీరోచిత ఇన్నింగ్స్ వృథా అయింది. హెూబార్ట్ హరికేన్స్ బ్యాటర్లు సత్తా చాటడంతో థండర్‌కు పరాజయం తప్పలేదు. లక్ష్య ఛేదనలో టిమ్ వార్డ్ 90 పరుగులతో అదరగొట్టగా, మిచెల్ ఓవెన్ 18 బంతుల్లో 45 పరుగులు చేసి మ్యాచ్‌ను హెూబార్ట్ వైపు తిప్పాడు. చివరకు హరికేన్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మ్యాచ్ అనంతరం వార్నర్ మాట్లాడాడు. 'రెండు ప్రారంభ వికెట్లు త్వరగా కోల్పోయాం. ఈ పిచ్‌పై ఓపికగా ఆడితే మంచి స్కోరు చేయొచ్చు. ప్రత్యర్థి బ్యాటర్లలో ఒకరు భారీ స్కోరు సాధిస్తారానుకున్నాం. కానీ ఇద్దరు ఆడారు. అదే మాకు కలిసి రాలేదు. ఇలాంటి పిచ్‌పై ఆత్మవిశ్వాసంతో నిలబడితే ఫలితం వస్తుంది' అని అన్నాడు.

# వరల్డ్‌కప్ విజేతకు షాక్.. ఆస్ట్రేలియా క్రికెటర్‌కు కెప్టెన్సీ..!




భారత జట్టు వన్డే ప్రపంచకప్ విజయంలో కీలకమైన దీప్తి శర్మ కు యూపీ వారియర్స్ పెద్ద షాకిచ్చింది. మహిళల ప్రీమియర్ నాలుగో సీజన్ కోసం ఆమెను కాదని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మేగ్ లానింగ్‌కు కెప్టెన్సీ అప్పగించింది. ఆదివారం ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా యూపీ ఫ్రాంచైజీ వెల్లడించింది. మూడు సీజన్లు ఢిల్లీ క్యాపిటల్స్‌ను నడిపించిన లానింగ్.. ఈసారి తమ జట్టు టైటిల్ కలను సాకారం చేస్తుందని యూపీ వారియర్స్ యాజమాన్యం భావిస్తోంది. కెప్టెన్‌గా కంటే సుదీర్ఘ అనుభవం, స్పష్టత, ప్రశాంత వంటి చాలా ప్రత్యేక లక్షణాలు లానింగ్‌లో ఉన్నాయి. ఆటను అర్థం చేసుకునే సామార్థ్యం, ఒత్తిడిని అధిగమించే తీరు, జట్టు సభ్యులతో ఆమె కలిసిపోయే తీరు.. అన్నీ లానింగ్‌ను యూపీ వారియర్స్‌కు మంచి కెప్టెన్‌గా చేస్తాయి' అని హెడ్‌కోచ్ అభిషేక్ నాయర్ పేర్కొన్నాడు. డబ్ల్యూపీఎల్‌లో ఒక్కసారి కూడా ఫైనల్ చేరని యూపీ వారియర్స్ ఈసారి ట్రోఫీపై కన్నేసింది. ఇటీవలే ముగిసిన వేలంలో దీప్తి శర్మను రూ.3.2 కోట్లకు తిరిగి సొంతం చేసుకుంది. దాంతో.. ఈసారి టీమిండియా ఆల్‌రౌండర్‌కే సారథ్యం అప్పగిస్తారనే వార్తలు వినిపించాయి. అలానే అనుభవజ్ఞురాలైన మేగ్ లానింగ్‌ను వేలంలో రూ.1.9 కోట్లకు తీసుకుంది. దాంతో, వీరిద్దరిలో ఒకరు జట్టును నడిపిస్తారని అనుకున్నారంతా. అయితే.. ఈ మెగా టోర్నీలో లానింగ్ రికార్డును దృష్టిలో పెట్టుకొని కీలక బాధ్యతలు కట్టబెట్టింది. లానింగ్ 27 మ్యాచుల్లో 952 పరుగులు చేసింది. మూడో సీజన్‌లో అలీసా హేలీ గాయపడడంతో దీప్తి శర్మ కెప్టెన్‌గా వ్యవహరించింది.

# అది మీకే తెలియాలి..

## సెలక్టర్లపై ఇర్ఫాన్ పఠాన్ అసహనం







భారత్ జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది. దీనికి సంబంధించిన భారత జట్టును శనివారం బీసీసీఐ ప్రకటించింది. అయితే ఈ జట్టులో సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి మరోసారి చోటు దక్కకపోవడం తీవ్ర చర్చకు దారితీసింది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా గెలుపులో కీలక పాత్ర పోషించిన షమీ, అప్పటి నుంచి సెలెక్షన్‌కు దూరంగానే ఉన్నాడు.

గాయాల నుంచి కోలుకున్న అనంతరం కూడా షమీని ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లకు పక్కనపెట్టారు. ఆపై ఆస్ట్రేలియాతో వన్డేలకు ఎంపిక కాలేదు. ఇప్పుడు బ్లాక్‌క్యాప్స్‌తో వన్డే సిరీస్‌కూ అతడికి నిరాశే ఎదురైంది. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో షమీ అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ షమీని ఎంపిక చేయకపోవడంపై మాజీ భారత ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పందించాడు. 'షమీ నిన్న మొన్న వచ్చిన ఆటగాడు కాదు. 450-500 అంతర్జాతీయ వికెట్లు తీసిన బౌలర్. 400కి పైగా వికెట్లు పడగొట్టిన ఆటగాడిని పక్కనపెట్టి ఫిట్‌నెస్‌పై ప్రశ్నలు లేవనెత్తడం ఆశ్చర్యంగా ఉంది. ప్రతి ఆటగాడికీ ఫిట్‌నెస్ పరీక్షలు సహజమే. కానీ షమీ ఇప్పటికే 200 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అన్ని ఓవర్లు వేసిన తర్వాత కూడా ఫిట్‌నెస్ సరిపోదంటే.. ఇంకా ఏ అతడు ఏం చేయాలి? అది సెలెక్షన్ కమిటీకే తెలియాలి' అని ఇర్ఫాన్ వ్యాఖ్యానించాడు.

**నేనే షమీ స్థానంలో ఉంటే..**

'నేనైతే షమీ స్థానంలో ఉంటే ఐపీఎల్‌లో ఆడి విధ్వంసం సృష్టిస్తాను. కొత్త బంతితో నా పాత రిథమ్ చూపిస్తాను. దేశవాళీ క్రికెట్‌ను గుర్తిస్తారు కానీ ఐపీఎల్‌లో ప్రదర్శన ఇస్తే ప్రపంచమే చూస్తుంది. అక్కడ రాణిస్తే ఎవరూ పట్టించుకోకుండా ఉండలేరు. అతడి కోసం తలుపులు పూర్తిగా మూసేయకూడదు' అని స్పష్టం చేశారు.

# తల్లిదండ్రుల త్యాగాలను గుర్తు చేసుకుని ఎమోషనలైన ఆస్ట్రేలియా క్రికెటర్



ఆస్ట్రేలియా క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో సిడ్నీలో జరుగుతోన్న చివరి టెస్టే అతడి కెరీర్‌లో చివరి మ్యాచ్ కానుంది. ఈ ప్రారంభానికి మ్యాచ్‌కు ముందు ఖవాజా ఓ మీడియా ఛానల్‌తో మాట్లాడాడు. ఈ క్రమంలో తన తల్లిదండ్రులు తారిఖ్, ఫోజియా పడిన కష్టాలను గుర్తు చేసుకుంటూ, తన క్రికెట్ ప్రస్థానం ప్రారంభం రోజుల్లో వారు చేసి త్యాగాలకు కృతజ్ఞతలు తెలిపాడు. ఖవాజా పాకిస్థాన్ లోని ఇస్లామాబాద్ లో జన్మించాడు. అతడి చిన్నతనంలోనే కుటుంబం ఆస్ట్రేలియాకు వలస వెళ్లింది. ఈ క్రమంలో2011 జరిగిన యాషెస్(ూాంష్త్రవం ంవతీఱవం) సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియా తరఫున క్రికెట్ లో అరంగేట్రం చేశాడు. అంతేకాక ఆసీస్ తరఫున ఆడిన తొలి ముస్లిం వ్యక్తి కూడా ఖవాజానే కావడం విశేషం.

ఖవాజా ఓ మీడియాతో మాట్లాడుతూ.. ' మాకు మంచి భవిష్యత్తు, అవకాశాలను అందించడానికి మా నాన్న ఎన్నో త్యాగాలు చేసి ఆస్ట్రేలియాకు వచ్చారు. మేము పాకిస్థాన్‌లో చాలా విలాసవంతమైన జీవితాన్ని గడిపాం. మాకు అక్కడ అందమైన భవనం ఉంది. అమ్మ విలాసవంతమైన జీవితాన్ని గడిపింది. అయితే ఆస్ట్రేలియాలో మాకు ఇంకా మంచి జీవితాన్ని అందించడానికి నాన్న వాటన్నింటినీ వదిలేశారు. ఆస్ట్రేలియాకు వస్తున్నప్పుడు మా అమ్మ చాలా బాధపడినట్లు నాకు గుర్తుంది. నేను చిన్నతనంలో అర్థం చేసుకోలేదు, కానీ ఇప్పుడు గుర్తు చేసుకుంటే నాకు అర్థమైంది. ఆమె జీవితం అంతా తలకిందులైంది. ఆస్ట్రేలియాకు వచ్చినప్పుడు మేము చాలా ఇబ్బంది లు పడ్డాం. కరెన్సీ మార్పిడి కష్టంగా ఉండేది. ఇక్కడికి వచ్చినప్పుడు నాన్ను ఉద్యోగం లేదు. చాలా కాలం కొత్త ఉద్యోగం దొరకలేదు కాబట్టి మా కోసం వారు చేసిన త్యాగాలను ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నానుః అంటూ ఖవాజా ఎమోషనల్ అయ్యాడు.

# చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై సుంకే రవిశంకర్ తీవ్ర విమర్శలు

## కొండగట్టు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాలు



కరీంనగర్, జనతా న్యూస్ : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రజలను అసత్యాలతో మభ్యపెడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. నేడు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఒక హెూటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిధులు మంజూరు చేయడం శుభపరిణామమని అన్నారు. ఆంజనేయ స్వామి పవన్ కళ్యాణ్ కుటుంబ దైవమని, అటువంటి పవిత్ర ఆలయానికి నిధులు ఇవ్వడం భక్తులందరికీ ఆనందాన్ని కలిగించే విషయమని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుతో తెలంగాణ ప్రభుత్వంలో కూడా చలనం వచ్చిందని వ్యాఖ్యానించారు. కొండగట్టు అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అబద్ధాలతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొండగట్టుకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. శాసనమండలి సాక్షిగా గత ప్రభుత్వం రూ. 100 కోట్ల నిధులు కేటాయించిందని మంత్రి కొండా సురేఖ చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ, అది నిజమా కాదా ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కొండగట్టు వై జంక్షన్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. తేదీ, సమయం చెబితే తమ నాయకులతో కలిసి హాజరవుతానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొండగట్టుకు చేపట్టిన అభివృద్ధి పనులను గణాంకాలతో పాటు ఫోటోలతో మీడియా ముందు వివరించారు. రూ. 1.25 కోట్లతో కొత్త కోనేరు, రూ. 2.50 కోట్లతో మెట్ల దారి సుందరీకరణ, రూ. 50 లక్షలతో రామస్థూప నిర్మాణం, రూ. 2.50 కోట్లతో దీక్ష విరమణ మండపం, కళ్యాణకట్ట ముందు సీసీ ఫ్లోరింగ్, గుడి ముందు భాగం చదును, కొత్త ఈవో కార్యాలయ నిర్మాణానికి రూ. 2.55 కోట్లు, భక్తుల కోసం షెడ్డు నిర్మాణం, శాశ్వత తాగునీటి కోసం రామప్ప నుంచి ప్రత్యేక పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంకులు, గుట్ట కింద షాపింగ్ కాంప్లెక్స్, బేతాళ ఆలయం వద్ద ఫ్లోరింగ్, భక్తుల క్యూలైన్ ఏర్పాటు, పంప్ హౌస్ నిర్మాణం వంటి పనులకు మొత్తం వందల కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామని తెలిపారు. ఇవన్నీ కళ్లకు కనిపించడం లేదా అంటూ ఎమ్మెల్యేపై మండిపడ్డారు. అదేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కొండగట్టు దేవాలయానికి 680 ఎకరాల విలువైన భూమిని కేటాయించామని గుర్తు చేశారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు ఆలయ భూములపై గుర్తింపులు వేశారని, దేవాలయానికి సంబంధించిన ఒక్క అంగుళం భూమిని కూడా ఎవరూ లాక్కోవడానికి ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే భక్తులతో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో గంట్ల వెంకటరెడ్డి, సాగి మహిపాల్ రావు, ఆకుల మధుసూదన్, చీకట్ల రాజశేఖర్, పూడూరు మల్లేశం, విజయేందర్ రెడ్డి, ఉప్పల గంగన్న, నాగశేఖర్, పైండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, మామిడి తిరుపతి, తోట మురళి, శనిగరపు అనిల్, జగన్, గుడిసె తిరుపతి, చిరుత అంజయ్య, మిల్కుల తిరుపతి, మహేందర్, జనగం శ్రీనివాస్, తిరుపతిరెడ్డి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు



కోరుట్ల, జనతా న్యూస్: కోరుట్ల మున్సిపల్ కమీషనర్ రవీందర్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని కిరాణా దుకాణాలు,టిఫిన్ సెంటర్లు చికెన్ సెంటర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను స్వాధీన పరుచుకొని 5000/- రూపాయలు జరిమానాలు విధించడంతో పాటు బట్ట సంచుల వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చెయ్యని దుకాణ దారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసి 4128/- ఫీజు కట్టించడం జరిగింది. దీనిని ఉదేశించి మున్సిపల్ కమీషనర్ రవీందర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిస్థాయిలో నిషేదించాలి లేనియెడల భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుంది. ట్రేడ్ లైసెన్స్ లేని వారు వెంటనే తీసుకోవాలి అని ఆయన తెలపడం జరిగింది. వ్యాపార కార్యకలాపాలతో వెలువడిన చెత్తను తడి, పొడి,హానికరక చెత్తగా వేరు చేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలిపారు లేనిచో నాఔవీ-2019 చట్టం ప్రకారం జరిమానా విధించబడును. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్ , అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, జవాన్లు రమేష్, రాజేష్,చంద్రప్రకాష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేములవాడలో రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఘన సన్మానం



వేములవాడ,జనతా న్యూస్: ఇటీవల జరిగిన రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కొత్తపల్లి శ్రీనివాస్‌కు వేములవాడ కెమిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఆదివారం వేములవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లా కెమిస్టుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అంకితభావంతో పనిచేస్తూ అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో వేములవాడ పట్టణ అధ్యక్షుడు, జిల్లా కోశాధికారి రైకన్నపేట శ్రీనివాస్‌తో పాటు నగుబోతు రమేష్, బోడ్ల అజయ్, సరిపెల్లి మల్లేశం, చీకటిమల్ల శ్రీనివాస్, కొండసాని రాజేష్, గంప రాజేందర్, ప్రశాంత్, రవి, బుచ్చిరెడ్డి, హింగే శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్, లక్ష్మణ్ తదితర కెమిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## హన్మంతునిపేటలో బీటి రోడ్డు పనులకు శంకుస్థాపన

### కాసులపల్లిలో ఫార్మర్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

పెద్దపల్లి, జనతా న్యూస్ : పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామంలో సమ్మక్కఉసారలమ్మ జాతర నిర్వహణకు అనుగుణంగా గద్దెల వరకు రూ. 1 కోటి వ్యయంతో చేపట్టనున్న నూతన బీటి రోడ్డు నిర్మాణ పనులకు గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామ అభివృద్ధి పనులకు రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకా ఫార్మర్ సర్వీస్ సెంటర్‌ను ఎమ్మెల్యే విజయరమణ రావు ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమం అనంతరం కేంద్ర యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు శ్రీనివాస్, సంపత్ రావు, కుమార్ గౌడ్, రాజయ్య, శ్రీనివాస్, సంపత్, పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## వైద్య శిబిరానికి విశేష స్పందన



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని దాచారం గ్రామంలో కరీంనగర్ సితార హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మేఘ వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బైర మానస రాజేందర్ మరియు ఉప సర్పంచ్ దీటి బాల నర్సు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దాచారం గ్రామంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు, హాస్పిటల్స్ సిబ్బందికి గ్రామం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజ్ కుమార్, సుప్రజ, వెంకట భరత్, వార్డు సభ్యులు సవనపెల్లి రాజు, కనగండ్ల చంద్రయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి కస్తూరిబా పాఠశాల విద్యార్థిని గుర్రం హర్షిని ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందగా, మృతురాలి తల్లిదండ్రులను ఆదివారం మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించి ఓదార్పును అందించారు. ఈ సందర్భంగా మృతురాలి తల్లిదండ్రులకు మాజీ ఎమ్మెల్యే వారి పెద్ద కుమార్తె చదువుకు అయ్యే పూర్తి ఖర్చులు తాను భరిస్తానని భరోసా ఇచ్చి వారికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిగుల్ల మోహన్, పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకులు చింతకింది శ్రీనివాస్ గుప్తా, చెలుకల తిరుపతి రెడ్డి, దేవరాజ్, బిగుల్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## హర్షిత మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణం

### సిపిఎం మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్.



జనత న్యూస్ బెజ్జంకి : ఇటీవల మృతి చెందిన కస్తూరిబా పాఠశాల విద్యార్థిని గుర్రం హర్షిత కుటుంబాన్ని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కల్లెపల్లి గ్రామంలో పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్ మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే హర్షిత మృతి చెందిందని, విద్యార్థిని సుహ తప్పి పడిపోయినప్పుడు హాస్టల్ సిబ్బంది కనీసం ప్రాథమిక చికిత్స కూడా అందించలేదని, హాస్పిటల్ కి తరలించకా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే మృతి చెందిందని , హాస్టల్లో కనీస వసతులు లేవని ఆరోపించారు. విద్యార్థిని మృతికి కారకులైన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బిగుళ్ల మోహన్,ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బొమ్మిడి సాయి కృష్ణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు సంగ ఎల్లయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల నూర్ భాషా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఘన సన్మానం



కోరుట్ల, జనతా న్యూస్: కోరుట్ల నూరు బాషా సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలలో నూతనంగా ఎన్నికైన నూర్ భాషా కుల సర్పంచులను కోరుట్ల నూర్ భాషా సంఘం సన్మానించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోరుట్ల నూర్ భాషా సంఘం అధ్యక్షులు రాజ్ మహమ్మద్, ఉపాధ్యక్షులు మౌలానా, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ ఉస్మాన్, క్యాషియర్ యాసీన్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కోరుట్ల సొంత భవనమైన దూదేకుల సంఘంలో చిన్న మెట్పల్లి సర్పంచ్ ఎండి రహీం, దూలూరు సర్పంచ్ ఎండి అజీమ్,నమిలికొండ సర్పంచ్ ఎండి షాబుద్దీన్,ని సన్మానించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వీరు సర్పంచిగా ఎదగడం చాలా ఆనందకరనీయమని తెలుపుతూ ఇదేవిధంగా అంచలంచలుగా ఎదగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు మాట్లాడుతూ ఇది మా ఘనత కాదని మా ఊరి ప్రజలకు మేము చేసిన మంచి పనుల వల్ల గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులుగా ఏర్పడి కుల మత వర్గ విభేదాలు లేకుండా వారు మమ్మల్ని ఈ స్థాయికి తీసుకొచ్చారని ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. దూదేకుల కులానికి ఎదుగుదలకు పిల్లల చదువుల అభివృద్ధికి మా వంతు సహాయం ఎల్లవేళలా ఉంటుందని మమ్మల్ని గుర్తించి సన్మానించిన కోరుట్ల దూదేకుల సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం కార్యవర్గం, సంఘ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో అంబరాన్నంటిన సీపీఐ వందేళ్ల సంబరాలు

## మిట్టపల్లిలో కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద మృతి

**కరీంనగర్ కేజీబీవీ పేరెంట్స్ తీవ్ర దిగ్భ్రాంతి**

సిద్దిపేట జిల్లా, జనతా న్యూస్ : సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బెజ్జంకి మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన హర్షిణి (7వ తరగతి) అనుమానాస్పదంగా మృతి చెందడంపై కరీంనగర్ కస్తూర్బా గాంధీ పాఠశాల పేరెంట్స్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది, హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు ఏ పాఠశాలలోనూ పునరావృతం కాకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, హాస్టల్ నిర్వాహకులు విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేరెంట్స్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కరీంనగర్ కస్తూర్బా గాంధీ పాఠశాల పేరెంట్స్ బోనగం శంకర్, పురుషోత్తం శ్రీనివాస్, రాగుల రాములు ఒక ప్రకటనలో తెలిపారు.

## జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలుఉ2026

**కరీంనగర్‌లో డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ, ఉచిత వైద్య శిబిరం**



కరీంనగర్,జనతా న్యూస్: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలుఉ2026లో భాగంగా నాలుగో రోజు కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది డ్రైవర్లకు సీపీఆర్ (CPR) శిక్షణతో పాటు ఉచిత కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ప్రణవ్ డ్రైవర్లకు సీపీఆర్ ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం వల్ల జరుగుతున్న మరణాల నేపథ్యంలో, సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, దానికి సంబంధించిన విధి విధానాలను ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కరీంనగర్ జిల్లా రవాణాశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పి. పురుషోత్తం మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన, దృష్టిలోపాలు లేని డ్రైవర్లతోనే భద్రతతో కూడిన రహదారి ప్రయాణం సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ ఆదేశాల మేరకు డాక్టర్ పుల్లారావు, డాక్టర్ ఉపేందర్, ఎంఎల్‌హెచ్‌పి కుమార్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ సురేష్‌తో పాటు ఏఎన్ఎంలు, ఆయాలు ఈ శిబిరాన్ని నిర్వహించడంలో సహకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, మోటారు వాహన తనిఖీ అధికారులు రవికుమార్, నాగలక్ష్మి, కవిత, సహాయక మోటారు వాహన తనిఖీ అధికారులు స్రవంతి, హరిత, సురేష్, రవాణాశాఖ సిబ్బంది, ఆర్ అండ్ డీఈ కిరణ్, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ నీలం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు పరీక్షల షెడ్యూల్ విడుదల

కరీంనగర్, జనతా న్యూస్ : జనవరిఉ2026లో నిర్వహించనున్న టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు పరీక్షలు ఈ నెల 10 నుంచి 13 వరకు జరగనున్నట్లు జిల్లా విద్యా శాఖ ప్రకటించింది. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు జనవరి 3 నుంచి అధికారిక వెబ్‌సైట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తెలంగాణ (www.bse.telangana.gov.in)లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు జిల్లా పేరు, ట్రేడ్ కోడ్ (ట్రేడ్ పేరుతో సహా), అభ్యర్థి పేరు ఎంపిక చేసి, నమోదు చేసిన పుట్టిన తేదీ (DD/MM/YYYY) వివరాలు నమోదు చేయడం ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత జిల్లా ప్రభుత్వ పరీక్షల కమిషనర్ , కరీంనగర్‌ను జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు ACLB & DEO (FAC), కరీంనగర్ జిల్లా విద్యా శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 66 డివిజన్ల ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాల పూర్తి స్థాయి పరిశీలన చేయాలి

**కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాలు**



కరీంనగర్, జనతా న్యూస్ : నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్ల ముసాయిదా ఎలక్ట్రోరల్ జాబితాపై వచ్చే అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన, వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్ అంశాలపై చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ, ప్రచురించిన ఓటర్ల జాబితాపై వచ్చే ప్రతి అభ్యంతరాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా డివిజన్, పోలింగ్ బూత్ వారీగా సరైన మ్యాపింగ్ చేయాలని సూచించారు. డివిజన్ ఓటర్ల ప్రకారం జాబితాలో పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుని, నిర్దిష్ట విధానంలో ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ ర్యాలీ, బహిరంగ సభలో నేతల ప్రసంగాలు




కరీంనగర్, జనతా న్యూస్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల ప్రస్తానం ప్రజాపోరాటాలు, ఉద్యమాలు, నిర్బంధాలు, త్యాగాలతో నిండిన ఘన చరిత్ర అని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ శతవసంతాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ, బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరంలోని సర్కస్ గ్రౌండ్ నుంచి రెవెన్యూ గార్డెన్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో డప్పు చప్పుళ్లు, కోలాట నృత్యాలు, కళాకారుల ఆటపాటలతో నగరం కోలాహలంగా మారింది. సీపీఐ కార్యకర్తలు, రెడ్ షర్ట్ వాలంటీర్లతో కరీంనగర్ ఎరుపుమయంగా మారింది. ర్యాలీ అగ్రభాగాన పల్లా వెంకటరెడ్డితో పాటు సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కలవేణ శంకర్ పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ గార్డెన్‌లో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో నేతలు ప్రసంగించారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ, డిసెంబర్ 26తో సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుందని, దేశంలో వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక రాజకీయ పార్టీ కమ్యూనిస్టు పార్టీనే అని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎనలేనిదని, దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం మొదట పిలుపునిచ్చింది సీపీఐనే అని గుర్తు చేశారు. ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేసిందని వివరించారు. స్వాతంత్ర్యానంతరం తెలంగాణలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొయినోద్దీన్ వంటి నేతలతో తెలంగాణ సాయుధ పోరాటానికి సీపీఐ నాయకత్వం వహించిందని తెలిపారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి గ్రామాలను వెట్టిచాకిరీ నుంచి విముక్తి చేసి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సీపీఐదని, ఆ పోరాటంలో వేలాది మంది కార్యకర్తలు ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి కీలక నిర్ణయాలు కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే అమలయ్యాయని అన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీకి విశిష్ట స్థానం ఉందన్నారు. పది లక్షల ఎకరాల భూమి పంపిణీ, 3,500 గ్రామాల విముక్తి, 4,500 మంది ప్రాణ త్యాగాల చరిత్ర ఏ పార్టీకి లేదని పేర్కొన్నారు. ఎర్రజెండా పార్టీల ఐక్యతే దేశానికి ప్రత్యామ్నాయమని, కమ్యూనిస్టులు, ప్రజాస్వామిక వాదులు ఏకమైతే దేశంలో మార్పు తప్పనిసరిగా వస్తుందన్నారు. రాబోయే పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కౌన్సిల్ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 45వ డివిజన్‌లో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



కరీంనగర్,జనతా న్యూస్ : కరీంనగర్ నగరంలోని 45వ డివిజన్ పరిధిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల (రంగవల్లికల) పోటీల విజేతలకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా. వి. నరేందర్ రెడ్డి బహుమతులు అందజేశారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశం, బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను ముగ్గుల పండుగగా కూడా పిలుస్తారని, ముగ్గులు ఇంటికి శ్రేయస్సు, సంపదను తీసుకువస్తాయని తెలిపారు. సంప్రదాయ కళారూపాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, అద్భుతంగా ముగ్గులు వేసిన మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ హిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకుడు అజీమ్‌ను అభినందించారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ విద్యావేత్త సింగమరాజు మాట్లాడుతూ, ముగ్గులు సంక్రాంతి పండుగకు ప్రత్యేక శోభను తీసుకువస్తాయని, మహిళలకు ఈ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షంచుకోవాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి మాట్లాడుతూ, పల్లె సంస్కృతికి అద్దం పట్టేలా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో జే. సరిత మొదటి బహుమతిగా రూ.5,000, అరుణ ద్వితీయ బహుమతిగా రూ.3,000, మమత తృతీయ బహుమతిగా రూ.2,000 నగదు బహుమతులు పొందారు. పాల్గొన్న మహిళలం దరికీ ప్రోత్సాహకంగా చీరలు అందజేశారు. సుమారు 250 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గందె కల్పనతో పాటు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## బొమ్మకల్‌లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన డివిజన్ ప్రజలు**

కరీంనగర్, జనతా న్యూస్ : బొమ్మకల్ ప్రాంతంలోని కృష్ణానగర్ జెండా గద్ద వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దేవరకొండ అజయ్ ఆధ్వర్యంలో, హంస హాస్పిటల్స్, గుడ్ లైఫ్ హాస్పిటల్స్ కరీంనగర్ వారి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక 34వ, 6వ డివిజన్లకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, ఈస్ట్ జోన్ అధ్యక్షులు అవుదుర్తి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎలగందుల నందకుమార్, రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, మాసం గణేశ్, గాలిపల్లి నారాయణ, పెద్ది లక్ష్మణ్, శ్రీరాముల శ్రీకాంత్, అరుణ్, శివాలయం చింతల సతీష్, గంగారపు వంశీ, తోడేంగల హరీష్, కాంపెల్లి నందు, గెల్లు అనిల్, జగజీవన్, శివాజీతో పాటు డివిజన్ నాయకులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com